జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 17, జనవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం



# పసుపు సైన్యం @ కోటి!

- 1,00,52,598 సభ్యత్వాలతో చరిత్ర తిరగరాసిన టీడీపీ
- లక్ష సభ్యత్వాల మార్క్ దాటిన 11 నియోజకవర్గాలు
- 50 వేల సభ్యత్వాల మార్క్ దాటిన 105 నియోజకవర్గాలు
- కార్యకర్తల సంక్షేమం కోసం లోకేష్ విప్లవాత్మక అడుగులు
- ప్రమాద బీమాను రూ. 5 లక్షలకు పెంపు
- యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్‌తో ఒప్పందం

**అమరావతి, మహానాడు:** తెలుగుదేశం పార్టీ(టీడీపీ) సభ్యత్వ నమోదు కార్యక్రమం సరికొత్త రికార్డు సృష్టించింది. గత ఏడాది అక్టోబర్ 26 న టీడీపీ అధినేత చంద్రబాబు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభ్యత్వాలు తీసుకున్న వారి సంఖ్య కోటి మార్క్‌ను దాటి చరిత్రను తిరగరాసింది. 1,00,52,598 మంది సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసారు. 11 నియోజకవర్గాలు లక్ష సభ్యత్వాల మార్కును దాటాయి. 105 నియోజకవర్గాలు 50 వేల సభ్యత్వాల మార్కును దాటాయి. కోటి మంది సభ్యులతో తెలుగుదేశం పార్టీ అతి పెద్ద కుటుంబంగా అవతరించింది. టెక్నాలజీ అనుసంధానంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం సులభమైంది. ప్రజలు స్వయంగా సభ్యత్వ నమోదు చేసుకునే సౌలభ్యం కల్పిస్తూ వారు

ఎక్కువగా వినియోగించే ప్లాట్ ఫామ్స్‌తో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇంత పెద్ద సక్సెస్ కావడానని ప్రధాన కారణం. టెక్నాలజీ వినియోగం ద్వారా పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో ఎవరు కష్టపడి పనిచేస్తున్నారో పార్టీ అధిష్ఠానానికి స్పష్టంగా తెలుస్తుంది. తద్వారా పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఇచ్చేప్పుడు ప్రాధాన్యత లభిస్తుంది. పనిచేసే వారికే ప్రాధాన్యత అని లోకేష్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. పార్టీ సభ్యత్వ నమోదులో తాము చేసిన కష్టానికి గుర్తింపు లభిస్తుందని కార్యకర్తలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. నారా లోకేష్ ఎక్కువ సభ్యత్వాలు చేసిన కార్యకర్తలతో మాట్లాడి అభినందించడం, ప్రోత్సహించడం ఈ సక్సెస్ కు ప్రధాన కారణం.

### టాప్ టెన్

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పోటీపడి మరీ రికార్డులు సృష్టించారు. 11 నియోజకవర్గాలు లక్ష సభ్యత్వాల మార్కు దాటాయి. టాప్ టెన్‌లో నెల్లూరు సిటీ 1,49,270, ఆత్మకూరు 1,48,802, పాలకొల్లు 1,48,559, రాజంపేట 1,45,766, కుప్పం 1,38,446, ఉండి 1,21,527, గురజాల 1,11,458, వినుకొండ 1,06,867, మంగళగిరి 1,06,145, కళ్యాణదుర్గం 1,01,221, కొవ్వూరు 1,00,473 నియోజకవర్గాలు ఉన్నాయి.

### లైఫ్ టైమ్ మెంబర్షిప్

శాశ్వత సభ్యత్వాలకు కూడా పెద్ద ఎత్తున స్పందన లభించింది. మంగళగిరి – 145, ఆత్మకూరు – 137, వినుకొండ – 79, గంగాధర నెల్లూరు – 62, తణుకు – 60 నియోజకవర్గాలు టాప్‌ఫైవ్‌లో నిలిచాయి. మిగతా.. 2లో

# పీవీ పుణ్యం పుచ్చిపోయింది!

## కామెంట్



(మార్తి సుబ్రహ్మణ్యం)



జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి.. కాంగ్రెస్‌ను లెక్కలేనన్నిసార్లు కష్టాలకడలి నుంచి బయట పడేసిన మహామనీషి పాములపర్తి వేంకట నరసింహారావు అనే పివి నరసింహారావును.. ఆయన చివరి వరకూ శ్వాసించిన కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు కరుణించింది.కొత్త కార్యాలయంలో పివి చిత్రపటానికీ కాసింత చోటిచ్చింది. మరింకేం? పివి పుణ్యం పుచ్చిపోయినట్లే కదా? ఆయన ఆత్మ ఆనందభైరవి రాగంతో నర్తించినట్లే కదా?

అంతలావు మేధావి పరమపదించినప్పుడు, ఆయన భౌతికకాయం నిమిషం కూడా హస్తినలో ఉండకూడదని భావించిన ఆనాటి యుపీఏ ఏలికలు.. చివరి చూపుకోసం ఆయన కాయాన్ని కాంగ్రెస్ కార్యాలయంలో పది సెకన్లు కూడా ఉంచేందుకు వీల్లేదన్న కఠిన పాషాణ హృదయంతో, హైదరాబాద్‌కు తరలించిన కాంగ్రెస్ నాయకత్వం.. ఇప్పుడు అర్జంటుగా తనపై ప్రేమ పొంగి పరవళ్లెత్తి, ముచ్చటగా మూడు చిత్రపటాలు పెట్టి.. మొహాన ఓ దండవేయించిన సోనియమ్మ దాతృత్వానికి, పాములపర్తి వారు పైనుంచే మురిసిముక్కలవ్వాలి కదా? ఆ ప్రకారంగా ఆయన పుణ్యం పుచ్చిపోయినట్లే కదా?!

అసలు పాములపర్తి గతించిన ఇరవైఏళ్ల తర్వాత, ఆయన అర్జెంటుగా గుర్తుకు రావడమే వింత. ఇందిరమ్మ నుంచి ఇందిరాకుమారుడి జమానా వరకూ, ఇందిరాకుమారురుడి నుంచి ఇంది'రాకుమారి' సోనియమ్మ హయాం వరకూ.. కాంగ్రె సుకు గొడ్డుచాకిరీ చేసిన తెలంగాణ బిడ్డ పాములపర్తి అంతిమయాత్ర కూడా అసంపూర్తిగా, ఆయన కట్టె కూడా పూర్తిగా కాలనంత అవమానించిన కాంగ్రెస్ నాయకామణికి.. ఇరవై ఏళ్ల తర్వాత పివి గుర్తుకు రావడం వింతల్లో వింత. అది కూడా ఢిల్లీ ఎన్నికల కాలంలో! పోనీలే.. అసలు పాత కార్యాలయంలో ఫొటోకు నోచుకోని పాములపర్తి వారికి, కనీసం కొత్త కార్యాలయంలోనయినా కాసింత చోటిచ్చినందుకు మెచ్చవలసిందే.

ఎందుకంటే ఐదేళ్లు మైనారిటీ సర్కారును, మెజారిటీగా మలిచి సుస్థిర పాలన అందించి.. రెండేళ్లు అధ్యక్షుడిగా ఏఐసిసిని వెలిగించిన పివిని, ఈ ఇరవైఏళ్లలో ఏఐసిసి ఆఫీసులో పట్టించుకునే దిక్కులేదు. రాష్ట్రపార్టీ కార్యాలయాల్లోనూ అదే అవమానపరంపర. ఆయన చిత్రపటానికి మూర దండవేసి, దణ్ణం పెడితేఒట్టు.

ఐదేళ్లు పార్టీకి నిధులందించిన వైఎస్ మృతి చెందితే.. సకుటుంబ సమపరివార సమేతంగా హైదరాబాద్ వచ్చి వాలిపోయి, వైఎస్ కుటుంబాన్ని ఓదార్చిన సోనియమ్మ అండ్ ఫ్యామిలీ.. అదే తన పార్టీకి అధ్యక్షుడితోపాటు, ప్రధానిగా చేసిన పివి కన్నుమూస్తే కనీసం ఆయన కుటుంబసభ్యుల వద్దకు వెళ్లి సానుభూతి చెప్పిన దాఖలాలు భూతద్దం పెట్టి వెతికినా కనిపించదు. ఎందుకంటే అయోధ్యలో మసీదు కూల్చివేతను అడ్డుకోకుండా పివి ప్రేక్షకపాత్ర పోషించారు కాబట్టి! దానితో అప్పటివరకూ తన భుజమెక్కిన ముస్లిములు, భుజం నుంచి దిగిపోయారు కాబట్టి!! ప్రధానిగా, పార్టీ అధ్యక్షుడిగా టెన్, జనపథ్ ఆదేశాలు పాటించలేదు కాబట్టి!!!

తెలంగాణ ముద్దుబిడ్డడన్న గౌరవంతో పివి స్మారకార్ధం పివి ఘాట్ ఏర్పాటుచేసి.. ప్రభుత్వపరంగా సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించిన, నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ గొప్పతనం గురించి ఎంత చెప్పినా తక్కువే. పైగా పివి బిడ్డకు ఎమ్మెల్సీ సీటు కూడా గౌరవించిన కేసీఆర్ రాజనీతి–హుందాతనంతో పోలిస్తే, సోనియా చాలా చిన్నగా కనిపిస్తారు. పోనీ పివి సంస్మరణ కోసం ఢిల్లీలో యుపిఏ సర్కారు, గజం జాగా ఇచ్చిన పాపానపోలేదు.

అలాంటి కాంగ్రెస్ నాయకామణి సారథ్యంలో జరిగిన కొత్తకార్యాలయ ప్రారంభోత్సంలో.. తెలంగాణ ముద్దుబిడ్డయిన తన ఫొటోలు మూడు కనిపించడంతో, పైనుంచి చూసిన పివి పుణ్యం పుచ్చిపోయింది! అయితే ఆ ఫొటోలు పార్టీ ఆఫీసు ప్రారంభోత్సవం కాబట్టి, మొక్కుబడిగా శాస్త్రప్రకారం పెట్టారా? లేదా అన్నది మరో రెండురోజుల్లోగానీ తెలియదు. ఎందుకంటే అప్పుడే కదా వాటిని తొలగించారా? లేదా? అని తెలిసేది?!

## కార్యకర్తే అధినేత!

**అమరావతి, మహానాడు:** కోటి సభ్యత్వాల మార్క్ దాటిన సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి తెలుగుదేశం పార్టీ(టీడీపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ లేఖ రాశారు. ప్రాణసమానమైన కార్యకర్తలకు మిగతా.. 2లో



## జడ్జి ముందు మీడియా సాక్షిగా లైవ్ డిబేట్

- రేవంత్ రెడ్డికి కేసీఆర్ ఆఫర్
- రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే నాతో పాటు లై డిటెక్టర్ పరీక్షకు రావాలి
- చట్టాన్ని గౌరవించే వ్యక్తిని
- తేదీ, సమయం రేవంత్ రెడ్డే నిర్ణయించాలి
- ఇలా అయితే ఓ యాబై లక్షల్లో నిజం తెలుస్తుంది
- రుజువు చేస్తే నేను ఏ శిక్షకైనా రెడీ
- ఈడీ విచారణ తర్వాత మీడియాతో మాట్లాడిన కేటీఆర్

**హైదరాబాద్:** భారత రాజ్యాంగాన్ని, చట్టాన్ని గౌరవించే వ్యక్తిని నేను. రాజకీయ వేధింపు,కక్ష సాధింపు చర్యల్లో భాగంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నా మీద ఓ అక్రమ కేసు పెడితే విచారణ




అధికారులు, విచారణ సంస్థలను గౌరవించి మొన్న తొమ్మిది తారీఖునాడు ఏసీబీ విచారణకు హాజరయ్యాను. ఏసీబీ కేసు పెట్టింది కాబట్టి ఈడీ విచారణకు పిలిస్తే ఈడీ విచారణకు కూడా హాజరయ్యాను.

రెండు సంస్థలు కూడా ఒకే రకమైన ప్రశ్నలను ఏడు గంటల పాటు అడిగి వివరాలు తీసుకున్నాయి..ఈ రెండు సంస్థలకు ఒక్కటే మాట చెప్పిన. మీరు ఎన్ని సార్లు పిలిచినా వచ్చి సమాధానం చెబుతాను. పూర్తిగా విచారణకు సహకరిస్తానన్నాను.ఈ విచారణకు 10 కోట్లు ఖర్చు అవుతుందంటున్నారు. అసలు అవినీతే జరగని ఈ కేసులో అన్ని పైసలను వృథా చేయడం ఎందుకు? ఆ పైసల తోని రైతు రుణమాఫీ చేయొచ్చు? ఇంకా ఏమైనా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయవచ్చు.

అందుకే సంక్రాంతి పండగ సందర్భంగా రేవంత్ రెడ్డికి నేను ఒక ఆఫర్ ఇస్తున్నాను. హైకోర్టు న్యాయమూర్తికాని, ఇంకా ఏవరైనా న్యాయమూర్తి ముందు మీడియా సాక్షిగా లైవ్ డిబెట్ కు పోదాం.

రేవంత్ రెడ్డి ప్యాలెస్‌లో అయినా ఈడీ ఆఫీస్‌లో అయినా, న్యాయ మూర్తి ముందు అయినా లై డిటెక్టర్ పరీక్షకు నేను రెడీ. దొంగెవరో? దొరెవరో? ఎవరి నిజాయితీ ఏందో రాష్ట్రం మొత్తం చూస్తుంది. రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే నాతో పాటు లై డిటెక్టర్ పరీక్షకు రావాలి. ఫార్ములా ఈ కార్ రేసు, ఓటుకు నోటు కేసులకు సంబంధించి రేవంత్‌ను, నన్ను ప్రశ్నలు మిగతా.. 2లో



## వృద్ధి రేటు మొదలైంది

- అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయి
- 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళికల అమలు
- గతేడాదితో పోలిస్తే ఈసారి 4.03 శాతం అదనపు వృద్ధి సాధించాం
- 15 శాతం వృద్ధితో వచ్చే ఏడాదికి GSDP 18.47 లక్షల కోట్లకు చేరుతుంది
- గత పాలకుల నిర్వాకంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది
- వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ మా నినాదంలి
- పీ-4ద్వారా పేదల జీవన ప్రమాణాలను పెంచుతాం
- ఈనెల 18న వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుడతాం
- ఏపీ వృద్ధి రేటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్


**అమరావతి, మహానాడు:** ఆంధ్ర రాష్ట్ర ప్రజలు నన్ను నమ్మారు. నేను వస్తే అభివృద్ధి జరుగుతుంది. సంపద వస్తుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఓట్లు వేసి గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని, 2047 నాటికి 42 వేల డాలర్ల తలసరి ఆదాయం లక్ష్యంగా నిర్ధేశించుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీ వృద్ధి రేటుపై గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

### విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు

గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. మూడు రాజధానుల పేరుతో అమరావతిని సమాధి చేశారు. ఏపీ జీవనాడి పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. గత పాలనలో ఎవ్వరికీ స్వేచ్ఛ లేదు. ఇక్కడ పుట్టి పెరిగిన వారు కూడా రాష్ట్రానికి రావాలన్నా , పెట్టుబడులు పెట్టాలన్నా భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. విపత్కర పరిస్థితుల నుంచి మిగతా.. 2లో

## యువ క్రికెటర్ నితీష్ రెడ్డికి మంత్రి లోకేష్ అభినందనలు

**అమరావతి, మహానాడు:** ఆస్ట్రేలియాలో జరిగిన టెస్ట్ సిరీస్ లో అసమాన ప్రతిభను కనబరిచిన ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి ఉండవల్లి నివాసంలో మంత్రి నారాలోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు వాడి సత్తాచాటిన నితీష్‌ను మంత్రి లోకేష్ అభినందించారు. రాష్ట్రంలో యువ ఔత్సాహక క్రీడాకారులకు నితీష్ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. నితీష్ ను మంగళగిరి చేనేత శాలువా, జ్ఞాపికతో మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా నితీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్పోర్ట్స్ పాలసీ చాలా బాగుందని అన్నారు. అయితే,




అందులో క్రికెట్ ను కూడా చేర్చి యువ క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఇందుకు మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. నితీష్ వెంట ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్ తదితరులు ఉన్నారు.



## మహాకుంభమేళా రాత్రి వేళ ఇలా

**మూడు రోజుల్లో 6 కోట్ల మందికి పైగా హాజరు**

పగలంతా భక్తులతో నిండిపోతున్న ప్రయాగ్‌రాజ్ రాత్రిపూట విద్యుత్ కాంతుల్లో విరాజిల్లుతోంది. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరలవు తున్నాయి. రంగు రంగుల బల్బుల వెలుగుల్లో త్రివేణీ సంగమం భువిపై వెలసిన స్వర్గంలా ఉందని పలువురు కామెంట్లు చేస్తున్నారు. కాగా మహాకుంభమేళాకు మూడు రోజుల్లో 6 కోట్ల మందికి పైగా హాజరయ్యారని సమాచారం.






03 వైద్య ఆరోగ్య శాఖలో 26,263 కొత్త ఉద్యోగాలు




03 హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మూసివేత



04 మనోజ్‌పై కేసు పెట్టిన మోహన్ బాబు



04 రాష్ట్ర వ్యాప్తంగా సంవిధాన్ గౌరవ దివస్

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 17, జనవరి 2025 ||



## జడ్జి ముందు మీడియా సాక్షిగా
# లైవ్ డిబేట్

మొదటి పేజీ తరువాయి..

అడగండి. నేను సమాధానం చెప్తాను. ఆయన కూడా జవాబు చెప్పాలి. తేదీ, సమయం రేవంత్ రెడ్డే నిర్ణయించాలి. ఇలా అయితే ఓ యాభై లక్షల్లో మొత్తం నిజం తెలుస్తుంది.

ఓటుకు నోటుకు కేసులో అడ్డంగా ఏసీబీ కి రేవంత్ రెడ్డి దొరికిండు కాబట్టే నా మీద కూడా ఏసీబీ కేసు పెట్టిచ్చిండు. రేవంత్ రెడ్డి మీద ఈడీ కేసు ఉంది కాబట్టే నా మీద ఈ ఈడీ విచారణ జరిపిస్తున్నారు. అంతిమంగా నిజం, న్యాయం, ధర్మం నిజాయితీనే గెలుస్తుంది.

హైకోర్టు. సుప్రీంకోర్టు. భారత న్యాయవ్యవస్థ మీద న్యాయమూర్తుల మీద నాకు విశ్వాసం ఉంది. ఇవాళ కాకుండా ఇంకో నాలుగు రోజులకైనా ప్రజలకు పూర్తి వాస్తవాలు తెలుస్తాయన్న విశ్వాసం నాకుంది. ఇక్కడికి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మీడియా మిత్రులకు అందరికీ ధన్యవాదాలు నేను తప్పు చేయలేదు తప్పు చేయబోను. ఇందులో అర పైసా అవినీతి కూడా జరగలేదు.

8 గంటలు వాళ్ళ ఇదే అడిగారు నేను ఇదే చెప్పారు తప్పు చేసినట్టు రుజువు చేస్తే నేను ఏ శిక్షకైనా రెడీ. పారదర్శకంగా నిధుల బదిలీ జరిగింది ఇంకెక్కడ మనీ లాండరింగ్ అని ఏసీబీ, ఈడీ అధికారులను అడిగాను ఏసీబీ 80 ప్రశ్నలు, ఈడీ 40 ప్రశ్నలు అడిగింది. అన్నింటికి సమాధానాలు ఇచ్చాను.

## జనసేన కార్యకర్తలకు అండగా ఉంటుంది

● ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను

**ఏలూరు:** ప్రమాదవశాత్తు మరణించిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు రూ. 5 లక్షల భీమా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏలూరు లో జరిగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని 18 చెక్కులను బాధిత కుటుంబ



సభ్యులకు అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను మరియు ఉమ్మడి పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణాజిల్లా స్థానిక జనసేన శాసన సభ్యులు పాల్గొన్నారు. జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఒంటిపులి సాంబశివరావు మృతి చెందారు. వారి తల్లి లలితకి 5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా సామినేని ఉదయభాను మాట్లాడుతూ.. జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆలోచన చాలా గొప్పదని ఈ విధంగా కష్టంలో ఉన్న కార్యకర్తలకు అండగా ప్రమాద భీమాని కల్పించడం చాలా గొప్ప విషయమని రాజకీయాల్లో ప్రమాదవశాత్తూ కార్యకర్తలు మరణించినా వారి కుటుంబానికి అండగా ఈ బీమా సొమ్ము ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట జనసేన నాయకులు బడిశా మురళి కృష్ణ, ఈమని కిషోర్ కుమార్, షౌకత్ అలీ, మేదూరి వెంకటాద్రి(బాబ్లు) పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

● టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



**అమరావతి, మహానాడు:** తెలుగుదేశం పార్టీ(టీడీపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, పద్మశ్రీ నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు అని భావించి తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు, బలహీన వర్గాల వారికి అండగా ఎన్టీఆర్ నిలబడ్డారని ఆయన పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి రోజున రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ నాయకులు పనిచేయాలని, ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ విగ్రహాల వద్ద ఘనంగా నివాళులు అర్పించాలన్నారు.




పెనుకొండ నియోజకవర్గం,సోమందేపల్లి మండలం, చాలకురు గ్రామంలో MGNREGS పథకంలో ఒక్కో యూనిట్ విలువ 1లక్ష 15 వేల రూపాయలతో మంజూరైన రైతు జూ చిరంజీవి యొక్క మినీ గోకులం షెడ్స్‌ను స్థానిక కూటమి నాయకులతో కలసి ప్రారభిం చారు.అనంతరం చాలకురు రైతు పరపతి సహకార సంగం ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు సబ్సిడీ ద్వారా అందించే కార్యక్రమంను ప్రారంభించిన బిబీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామంత్రి సవిత



అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి సిఎం చంద్రబాబును కలిసి సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

## జగడం రమేష్‌ను అభినందించిన సీఎం

**అమరావతి, మహానాడు:** ఇస్రో ఇటీవల నిర్వహించిన పరీక్షలో ఆలిండియా 9 ర్యాంకు సాధించి సైంటిస్ట్‌గా ఎంపికైన తెలుగు యువకుడు జడగం రమేష్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రమేష్ తండ్రి శ్రీనివాసులు డ్రైవర్‌గా, తల్లి రామలక్ష్మి టైలర్‌గా పని చేస్తూ కష్టపడి చదివించారని తెలుసుకున్న ముఖ్యమంత్రి వారిని అభినందించారు.



చంద్రయాన్-3 ల్యాండర్ మిషన్ టీమ్‌లో ఒకరిగా పనిచేసిన రమేష్, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

# పసుపు సైన్యం @ కోటి!

మొదటి పేజీ తరువాయి..

### కార్యకర్తల సంక్షేమం

కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులుగా భావిస్తుంది. వారి సంక్షేమానికి భారతదేశంలోనే ఏ రాజకీయ పార్టీకి లేని కార్యకర్తల సంక్షేమ విభాగాన్ని ఏర్పాటు చేసి..టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో దిగ్విజయంగా నడిపిస్తున్నారు. కార్యకర్తలు.. వారి కుటుంబసభ్యుల విద్య, వైద్యం, వివాహం, ఆర్థిక అవసరాలలో ఆదుకుంటూ కొండంత అండగా నిలుస్తున్నారు. ప్రమాదంలో కార్యకర్తలు చనిపోతే వారి కుటుంబానికి ప్రమాదభీమా అందించి ధీమా కల్పిస్తున్నారు.

టీడీపీ కార్యకర్తల బాగోగులు చూసుకునే బాధ్యత లోకేష్ కు అప్పగిస్తున్నామని 2014 మహానాడులో టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించారు. నాటి నుంచి నేటివరకూ కార్యకర్తల పెన్నిధిగా వ్యవహరిస్తున్న లోకేష్ సంక్షేమనిధితో ఆదుకుంటున్నారు. ఇప్పటివరకు 2500 మందికి పైగా కార్యకర్తల పిల్లల చదువులకు సహాయం చేశారు.

వివిధ ప్రమాదాల్లో మరణించిన సుమారు 5164 మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల రూపాయలు చొప్పున రూ. 103 కోట్ల 28 లక్షల రూపాయలు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అనేక మంది కార్యకర్తలకు వైద్య సహాయం అందించారు. సుమారు 2000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. సుమారు 5000 మంది కార్యకర్తల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలిచి రూ.19 కోట్లు ఆర్థిక సహాయం చేశారు. రూ.100తో సభ్యత్వం తీసుకున్న తెలుగుదేశం కార్యకర్తల సంక్షేమం చూసేందుకు లోకేష్ ఆధ్వర్యంలో టిడిపి వెల్ఫేర్ వింగ్ అవిశ్రాంతంగా పని చేస్తోంది. ఎన్టీఆర్ మోడల్ స్కూళ్ల ద్వారా ఉచిత విద్య, ఉపకారవేతనాలు, ప్రైవేట్ స్కూళ్లలోనూ ఫీజుల్లో రాయితీలుగా రూ. 2 కోట్ల 35 లక్షల రూపాయలు చెల్లించారు. చదువు పూర్తయిన వారికి ఉపాధి..ఉద్యోగావకాశాలు సాధించేలా నైపుణ్యశిక్షణ ఇస్తున్నారు.

ప్రస్తుతం అదే రూ.100తో తీసుకున్న సభ్యత్వం ద్వారా వచ్చే ప్రమాద బీమా ప్రయోజనాన్ని రూ. 5 లక్షలకు పెంచారు. నారా లోకేష్ సమక్షంలో కోటి మందికి ప్రమాద భీమా కల్పిస్తూ తెలుగుదేశం పార్టీ, యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ మధ్య ఒప్పందం చేసుకున్నారు.

# కార్యకర్తే అధినేత!

మొదటి పేజీ తరువాయి..

అభినందనలతో, విశ్వ విఖ్యాత దివంగత నందమూరి తారకరామారావు పార్టీ పెట్టిన ముహూర్త బలం చాలా గట్టిది. నాడు ఒక్కరితో ప్రారంభమైన ప్రయాణం నేడు కోటి మందితో అతి పెద్ద కుటుంబంగా మారింది. సభ్యత్వం తీసుకొని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కుటుంబ సభ్యులుగా చేరిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామగ్రామాన ఒక పండగలా నిర్వహించారు. ఊరూవాడా జై టిడిపి నినాదాలతో హోరెత్తించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్‌తో సహా అనేక ప్రాంతాల్లో ఉన్న తెలుగువారు, వివిధ దేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐ లు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములు అయ్యారు. గత రికార్డులు తిరగరాస్తూ కోటి సభ్యత్వాలతో సరికొత్త చరిత్ర సృష్టించాం. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులు, సిబ్బందికి శుభాకాంక్షలు.

కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం, బలగం . పసుపు జెండా అంటే మనకు ఒక ఎమోషన్. పీక మీద కత్తి పెట్టి వేరే పార్టీ అధినేతకు జై కొడితే విడిచిపెడతామని చెప్పినా జై చంద్రబాబు, జై టిడిపి అంటూ ప్రాణత్యాగం చేసిన చంద్రయ్య నాకు ప్రతి క్షణం గుర్తొస్తారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రత్యర్థులు ఉన్మాదుల్లా మీద పడుతుంటే మీసం మెలేసి, తొడకొట్టి జై చంద్రబాబు అన్న అంజిరెడ్డి తాత తెగువ నాకు నిత్యస్ఫూర్తి. సార్వత్రిక ఎన్నికల్లో బూత్ ఏజెంట్ గా ఉండటానికి వీలు లేదని ప్రత్యర్థి మూకలు గొడ్డలి వేటు వేసినా రక్తపు గాయాలతోనే పోలింగ్ బూత్ లో కూర్చొని రిగ్గింగ్ అడ్డుకున్న ఉక్కు మహిళ మంజుల గారి ధైర్యం గురించి గుర్తుచేసుకున్న ప్రతిసారి నాకు గర్వంగా ఉంటుంది. ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే ప్రతి గ్రామంలో ప్రాణం ఎక్కువా? పార్టీ ఎక్కువా? అంటే పార్టీనే ఎక్కువ అని జైకొట్టే చేతులు అనేకం. ఏమి ఇచ్చినా, ఎన్ని జన్మలెత్తినా కార్యకర్తల రుణం తీర్చుకోలేనిది. దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తల బలం టిడిపి కి మాత్రమే సొంతం. అలానే ఏ పార్టీ ఇవ్వని గౌరవం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఇస్తుంది.

అధినేత చంద్రబాబు పార్టీలో ఏ ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాలన్నా కార్యకర్తలతో చర్చించిన తరువాతే ప్రకటిస్తారు. కార్యకర్తల మనోభావాలను, అభిప్రాయాలను గౌరవించే ఒకే ఒక్క పార్టీ తెలుగుదేశం మాత్రమే. మంచి నిర్ణయం తీసుకుంటే పొగిడేది మీరే, ఏదైనా నిర్ణయం నచ్చకపోతే ప్రశ్నించేది మీరే. అందుకే పార్టీలో ప్రతి కార్యకర్త అధినేతే. కార్యకర్తల సంతోషమే చంద్రబాబుకి ఆనందం. ఆయన నాతో మాట్లాడిన ప్రతిసారి కార్యకర్తల చర్చ ఖచ్చితంగా ఉంటుంది. కార్యకర్తలకు ఉపాధి, వైద్యంతో పాటు వారి పిల్లల చదువుకు సాయం చెయ్యాలని చెబుతుంటారు. కార్యకర్తల సంక్షేమ నిధి సమన్వయకర్తగా పవిత్రమైన బాధ్యత నాకు అప్పగించారు.

ఇప్పటివరకు 2,500 మందికి పైగా కార్యకర్తల పిల్లల చదువులకు సహాయం అందించాం. వివిధ ప్రమాదాల్లో మరణించిన సుమారు 5164 మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల రూపాయలు చొప్పున రూ. 103 కోట్ల 28 లక్షల రూపాయలు అందజేసాం. అనారోగ్యంతో బాధపడుతున్న అనేక మంది కార్యకర్తలకు వైద్య సహాయం అందించాం. సుమారు 2000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాం. సుమారు 5000 మంది కార్యకర్తల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలిచి రూ. 19 కోట్లు ఆర్థిక సహాయం చేసాం. సభ్యత్వం తీసుకున్న తెలుగుదేశం కార్యకర్తల సంక్షేమం చూసేందుకు టిడిపి కార్యకర్తల సంక్షేమ విభాగం అవిశ్రాంతంగా పని చేస్తోంది. ఎన్టీఆర్ మోడల్ స్కూళ్ల ద్వారా ఉచిత విద్య, ఉపకారవేతనాలు, ప్రైవేట్ స్కూళ్లలోనూ ఫీజుల్లో రాయితీలు రూ. 2 కోట్ల 35 లక్షల రూపాయలు చెల్లించాం.

చదువు పూర్తయిన వారికి ఉపాధి..ఉద్యోగావకాశాలు సాధించేలా నైపుణ్యశిక్షణ ఇస్తున్నాం. ప్రస్తుతం సభ్యత్వం ద్వారా వచ్చే ప్రమాద బీమా ప్రయోజనాన్ని రూ. 5 లక్షలకు పెంచాం. జెండా మోసే ప్రతి కార్యకర్తకు అండగా నిలవడమే నా ఎజెండా. కొన్ని నియోజకవర్గాల నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్మాత్మకంగా తీసుకొని లక్షకు పైగా సభ్యత్వాలు చేయడంతోపాటు లైఫ్ టైమ్ సభ్యత్వాలు కూడా ఎక్కువగా చేశారు. వారికి నా ప్రత్యేక అభినందనలు. లైఫ్ టైమ్ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. కార్యకర్తకు భరోసా ఇచ్చే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని కోటి సభ్యత్వాలతో రికార్డులు బద్దలు కొట్టడంలో భాగస్వామి అయిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

# వృద్ధి రేటు మొదలైంది

మొదటి పేజీ తరువాయి..

రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లే బాధ్యత ప్రజలు మాకు అప్పగించారని ముఖ్యమంత్రి అన్నారు.

### సంపద సృష్టిస్తేనే ఆదాయం పెరుగుతుంది :

అభివృద్ధి వల్ల సంపద వస్తుంది. సంపద వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వ ఆదాయం పెరిగితే దాన్ని సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించి పేదరికం రూపుమాప వచ్చు. ఇది నేను నమ్మిన ఆర్థిక సిద్ధాంతం. 1995లో నేను ఐటీ అంటే అందరూ నవ్వారు. ఐటీ తీసుకొస్తే తిండిపెడుతుందా అని చాలామంది ఎగతాళి చేశారు. నేడు ఐటీ మనిషిని ఎక్కడికో తీసుకెళుతోంది. 1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణలు, 1992లో వచ్చిన ఇంటర్నెట్ విప్లవాన్ని నేను మనసావాచా నమ్మి ఆచరణలో పెట్టాను. నేను తెచ్చిన విజన్ 2020తో నేడు దేశంలోనే తలసరి ఆదాయంలో తెలంగాణ ముందుంది.

ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఎక్కువ తలసరి ఆదాయం సంపాదిస్తున్నారు. రెండోతరం ఆర్థిక సంస్కరణలకు నేను నాంది పలికాను. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి రాష్ట్రానికి వెలుగులు ఇచ్చి నేను ఓడిపోయాను. ఆ విషయంలో నేను రాజీపడి ఉంటే ఓడిపోయేవాడిని కాదేమో.

విమానాశ్రయాలకు ఓపెన్ స్కై పాలసీ తీసుకొచ్చాను. శంషాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులకు శ్రీకారం చుట్టాను. శంషాబాద్ ఎయిర్ పోర్టును 5 వేల ఎకరాలతో ప్రారంభించామని ముఖ్యమంత్రి చెప్పారు. నాడు విశాలమైన రహదారులకు శ్రీకారం చుట్టాను. నేడు 14 లైన్ల వరకూ రోడ్లు వేస్తున్నారు. నాడు హైదారాబాద్ లో 163 కిలోమీటర్ల రింగ్ రోడ్డుకు శ్రీకారం చుట్టాము. ఇవన్నీ చేయడం వల్ల ఆదాయం పెరిగింది.

### 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం

స్వర్ణాంధ్ర - 2047 విజన్ లక్ష్యంగా పనిచేస్తున్నాము. 15 శాతం వృద్ధి రేటు సాధించడం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాము. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తయారుకావాలని లక్ష్యాన్ని నిర్దేశించున్నాము. గత సంవత్సరం కంటే ఈ ఏడాది 4.03 శాతం వృద్ధి రేటు పెరిగింది. తెలుగుదేశం హయాంలో తలసరి ఆదాయం వృద్ధి 13.21 శాతం ఉండగా గత ప్రభుత్వంలో అది 9.06 శాతమే ఉంది.దీనివల్ల ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి. ఆదాయం పెరిగితేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అందుకే విజన్ రూపొందించి దానికి అనుగుణంగా పనిచేస్తున్నాము. టీడీపీ వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. టీడీపీ అధికారంలో ఉంటే రైతులకు పండుగే. ఏడు




నెలల్లోనే రూ. 1500 కోట్ల బకాయిలు చెల్లించాము.

### పీ-4 గేమ్ ఛేంజర్ :

ఉమ్మడి రాష్టంలో అమలు చేసిన సంస్కరణలు, తెచ్చిన పాలసీలతో కోట్లాది మంది జీవితాలు మారాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా నాడు తీసుకువచ్చిన P3 (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) విధానంతో ఉపాధి, సంపద సృష్టి జరిగింది. ఇప్పుడు స్వర్ణాంధ్ర -2047 విజన్ ను ఆవిష్కరించాం. ఇందులో పేర్కొన్న పది సూత్రాల అమలు ద్వారా తెలుగు జాతిని ప్రపంచంలో నెంబర్ 1 చేసేందుకు అడుగులు వేస్తున్నాం.

వీటిలో ప్రథమ సూత్రం జీరో పావర్టీ. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్దేశించిందే P4 కాన్సెప్ట్ (పబ్లిక్ -ప్రైవేటు-పీపుల్-పార్టనర్షిప్) దక్షిణ భారతదేశంలో జనాభా పెరుగుదల రేటు క్షీణించడం ఆందోళన కలిగిస్తోంది. ఏపీ జనాభా వృద్ధి రేటు 1.5 శాతం. దక్షిణ కొరియాలో అయితే 5 శాతం వృద్ధి ఉంది. జపాన్, చైనా, యూరప్ వంటి దేశాల్లో జనాభా తగ్గింది. జర్మనీ వంటి దేశాలు ఇప్పుడు మన మానవ వనరులు కోసం ఎదురుచూస్తున్నాయి.

### వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ మా నినాదం

ఒక వ్యక్తి ఆనందంగా ఉంటే ఆ కుటుంబం ముందుకు పోతుంది. కొన్ని కుటుంబాల్లో పిల్లలు తల్లిదండ్రులను చూసుకోలేని పరిస్థితి. నేను రూ. 4 వేలు పెన్షన్ ఇవ్వడంతో ఇప్పుడు తల్లిదండ్రులను పిల్లలు చూసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు, కిడ్నీ రోగులకు రూ. 10 వేలు ఇచ్చాం. మంచం మీద నుంచి లేవలేని స్థితిలో ఉన్నవారికి రూ. 15 వేలు ఇస్తున్నాము.

### ఈ నెల 18న వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం

కుటుంబ వ్యవస్థ వల్ల భద్రత ఉంటుంది. నేడు ఆధార్ వల్ల ఎవరు ఏంటో వెంటనే తెలిసిపోతోంది. పూర్తి వివరాలు వచ్చేస్తున్నాయి. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పెట్టినా, పెన్షన్ ఇచ్చినా, రైతు భరోసా ఇచ్చినా విడివిడిగా ఇస్తున్నారు. నేను వీటన్నింటినీ కుటుంబానికి అనుసంధానం చేస్తున్నాను. ఆ ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తున్నాను. ఏదైనా విపత్తు వస్తే నేరుగా సంబంధిత ఇంటి వివరాలు వచ్చేస్తాయి. ఈనెల 18న వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుడుతున్నాము. సెల్ ఫోన్ ద్వారా ప్రజలకు అవినీతి రహితంగా 150 సేవలు అందిస్తాము. దీనివల్ల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదు.

### విజన్‌తో అద్భుత ఫలితాలు

ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అమరావతి పనులు జరుగుతున్నాయి. పోలవరం పనులు వేగవంతం చేశాం. అమెరికా సిలికాన్ వ్యాలీలో నీరు లేక రూ. 4 లక్షల కోట్ల ఆస్తి బూడిదయ్యింది. అందుకే నీటి భద్రత చాలా ముఖ్యం. పోలవరం పూర్తయ్యే నాటికి గోదావరి పెన్నా నదుల అనుసంధానం చేస్తాము. టెక్నాలజీ సాయంతో వ్యవసాయం లాభసాటిగా మార్చడంతో పాటు ఖర్చు తగ్గించే విధానాలపై దృష్టి పెట్టాను. ఏపీలో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి పెట్టాను. స్వచ్ఛాంధ్రప్రదేశ్ నినాదాన్ని ప్రజల్లోకి ఉధృతంగా తీసుకెళున్నాము. గత ఐదేళ్లు గుంతల రోడ్లుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆరు నెలల్లోనే రోడ్లు వేశాం. సంక్రాంతికి ఇంటికి వెళ్లిన వారందరూ రోడ్లను చూసి సంతోషం వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

# పేదరికం నిర్మూలన చంద్రబాబుతోనే సాధ్యం

### చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**వినుకొండ, మహానాడు:** రాష్టంలో పేదరికం నిర్మూలన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన పీ4 విధానంతోనే సాధ్యమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పేదరికం లేని రాష్ట్రాన్ని సాధించి చూపిస్తామని ఎన్నికలకు ముందే హామీ ఇచ్చామని, ఇప్పుడు ఆ దిశగానే కూటమి ప్రభుత్వం చర్యలు ఉండబోతున్నాయనీ ఆయన తెలిపారు. అందుకోసమే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలూ భాగస్వామ్యులు కావాలని సీఎం పిలుపునిచ్చారని, అందుకు స్పందించి, సహకరించాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. రాష్ట్రాన్ని 2024 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేలా ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం వెల్లడించిన ప్రజంటేషన్‌పై ఈ మేరకు జీవీ స్పందించారు. ఒక్కసారి అమరావతి పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌కు అది హైదరాబాద్‌ను మించిన గ్రోత్ ఇంజిన్ అవుతుందని, దేశంలోని అతిపెద్ద మెట్రోపాలిటన్ రీజియన్‌లలో అది ఒకటిగా నిలుస్తుందన్నారు.





రంగంపేట మండలం సింగంపల్లిలో శ్రీ బిరాలమ్మ అమ్మవారిని అనపర్తి శాసన సభ్యుడిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మర్రిపూడి గ్రామ శాఖ టిడిపి అధ్యక్షుడు పుట్టా వెంకటేష్ చౌదరి పాల్గొన్నారు. తాను మొక్కుకున్న మొక్కును చెల్లించుకున్నారు. కాగా, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూటమి నేతలు ఘనంగా సత్కరించారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 17, జనవరి 2025

# రెండొందల నోటును నిషేధిస్తారా?

◆ **ఆర్బీఐ కీలక ప్రకటన**



**న్యూఢిల్లీ, మహానాడు:** రూ. 2000 నోటును క్యాన్సిల్ చేసినట్లుగానే 200 రూపాయల నోటును కూడా వెనక్కు తీసుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకోబోతుందా? సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఇలాంటి వార్తల గురించి ఆర్బీఐ ప్రజలకు క్లారిటీ ఇచ్చింది. పెద్ద నోట్ల వల్లే దేశంలో అవినీతి పెరుగుతుందని ఆర్బీఐ భావిస్తోంది. చరిత్రలో జరిగిన ఘటనలు చూస్తుంటే ఇదే నిజమే అనిపిస్తుంది.

ఒకప్పుడు రూ. 10వేల నోటు కూడా ఉండేదట. కాలక్రమేణ అవినీతి పెరిగిపోవడంతో దాన్ని రద్దు చేసిందట. అయితే ఈ మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐలు అవినీతి పెరుగుతుందని భావించి దశల వారీగా పెద్ద నోట్లను రద్దు చేసేందుకు ప్రయత్నించాయి. ఇందులో భాగంగానే 2,000, 1,000, 500 నోట్ల రద్దు జరిగింది.

2016 నవంబర్‌లో రూ.500, రూ.1000 నోట్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో 2000వేల నోటును తీసుకువచ్చింది. అయితే రూ. 2వేల నోట్లను వెనక్కు తీసుకుంటున్నట్లు ఆర్బీఐ 2023 మే 19వ తేదీన మొదటిసారిగా ప్రకటించింది. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో వీటిని మార్చుకోవచ్చని ఆర్బీఐ సూచించింది. ఆర్బీఐ ప్రకటనతో జనం తమ దగ్గరున్న రూ. 2వేల నోటును మార్పిడి చేసుకున్నారు. ఇప్పటి వరకు రూ. 2వేల నోట్లు దాదాపు 99 శాతం వెనక్కి వచ్చాయి.

ప్రస్తుతం మార్కెట్లో పెద్ద నోట్లుగా ఉన్న 500 నోట్లకు నకిలీలు హల్ చల్ చేస్తున్నాయి. అందుకే ఆర్బీఐ ప్రజలను అప్రమత్తం చేయడానికి ఫేక్ కరెన్సీ ని గుర్తించే సూచనలు చేస్తోంది. ఇప్పటికే 2,000నోట్లు, 500 నోట్ల గురించి సూచనలు చేసిన ఆర్బీఐ ఈమధ్యే 200రూపాయల నోట్ల గురించి సూచనలు చేసింది.

ఎందుకంటే 200 రూపాయల నోట్లకు కూడా నకిలీ నోట్లు మార్కెట్లోకి వచ్చేశాయని వార్తలు వైరల్ అవుతున్నాయి. వీటిని నిజం చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో 200 రూపాయల నోట్లకు కలర్ జిరాక్సులు తీయించి చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

2000 నోటు ఉపసంహరణ తర్వాత నకిలీ 200, 500 నోట్లు పెరిగాయని ఆర్బీఐ ప్రకటించింది. జాగ్రత్తగా ఉండాలని ప్రజలను హెచ్చరించింది. ఫేక్ కరెన్సీ ఎలా గుర్తించాలో తెలియజేస్తూ పలు ప్రకటనలు కూడా జారీ చేసింది. ఈమధ్యే నకిలీ 200 నోట్లు కూడా మార్కెట్లోకి రావడంతో వీటిని రద్దు చేసేందుకు ఆర్బీఐ చర్యలు తీసుకుంటున్న సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

ఈ నేపథ్యంలో అసలు 200 నోటుకు ఉండే లక్షణాలను ఆర్బీఐ తెలియజేసింది. 200నోటుపై గాంధీ బొమ్మ , ఆర్బీఐ భారత్, ఇండియా, 200, అశోక స్తంభం గుర్తులు తప్పకుండా ఉండాలని వీటిలో ఏది లేకున్నా అది ఫేక్ కరెన్సీ అని తెలిపింది. ఈ నేపథ్యంలో 200 నోట్లు వెనక్కు తీసుకునే ఆలోచన ఏమీ లేదని కూడా తెలిపింది.

# వైద్య ఆరోగ్య శాఖలో 26,263 కొత్త ఉద్యోగాలు

● **త్వరలో భర్తీ**



**విజయవాడ, మహానాడు:** ప్రభుత్వం తాజాగా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు వెల్లడించింది. రాష్ట్రంలోని వివిధ బోధనాస్పత్రులతో సహా ప్రభుత్వ వైద్యశాలలు, ఆయుర్వేద, హోమియో, యునాని ఆసుపత్రుల్లో భారీగా ఖాళీలు ఉన్నట్లు పేర్కొంది. విభాగాల వారీగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు ఈ కింద తెలుసుకోవచ్చు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని విభాగాల పరిధిలో భారీగా ఖాళీలు ఉన్నట్లు వెల్లడించింది. వైద్యులు, పారామెడికల్ ఉద్యోగాల ఖాళీలే సుమారు 25.97 శాతం వరకు ఉన్నట్లు తెల్పింది. నిర్ణీత 1,01,125 ఉద్యోగాలలో 3,114 వైద్యులు, 23,149 పారామెడికల్ ఉద్యోగుల కొరత ఉంది. అంటే మొత్తం 26,263 పోస్టులు ప్రస్తుతం వైద్యా ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్నట్లు పేర్కొంది.

ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్), డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్‌హెల్త్ (డీహెచ్), ఆయుష్, జాతీయ ఆరోగ్యమిషన్‌లలో ఖాళీ పోస్టుల వివరాలను తాజాగా వైద్య ఆరోగ్య శాఖ సేకరించింది. అయితే వీటిలోని ఖాళీలను అవసరాల మేరకు మాత్రమే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రాధాన్య క్రమంలో తొలుత ఏడెనిమిది వేల పోస్టుల భర్తీ చేసేందుక వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోనుంది. గత ప్రభుత్వ హయాంలో వైద్యా ఆరోగ్య శాఖలో పోస్టులు భర్తీ చేయకపోవడమే ఇంత పెద్ద మొత్తంలో ఖాళీలు ఏర్పడటానికి కారణమని స్పష్టమవుతోంది.


వైద్య ఆరోగ్య శాఖలో అంతర్భాగంగా ఉన్న ఆయుష్ కింద ఆయుర్వేద, హోమియో, యునాని ఆసుపత్రులు సేవలందిస్తున్నాయి. ఆయుష్ విభాగంలో మొత్తం 825 వైద్యుల పోస్టులకుగాను 407 ఖాళీలు ఉన్నాయి. కాంపౌండర్లు, అటెండర్లు, ఇతర అవసరాలకు కలిపి 1601 ఉద్యోగాలు మంజూరుకాగా వాటిల్లో 1131 పోస్టులు ఖాళీగానే ఉండటం విశేషం.

ఇక అటు బోధనాసుపత్రుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బోధనాసుపత్రుల్లో స్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ వైద్యుల సేవలు అందిస్తున్నారు. వీటిల్లో మొత్తం 5,749 వైద్యుల పోస్టుల మంజూరుకాగా 1,484 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విజయవాడ జీజీహెచ్‌లో 314 వైద్యుల పోస్టులకుగాను 46 ఖాళీగా ఉన్నాయి.

మెడికల్, సర్జికల్ ఆంకాలజీ విభాగాల్లో 4 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం సర్జికల్ ఆంకాలజీలో ఒకరే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. రేడియాలజీలో 2 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఒక పోస్టు, గ్యాస్ట్రోఎంటరాలజీలో 2 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, నెఫ్రాలజీలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, గైనకాలజీలో 14కుగాను 10 మంది వైద్యులే ఉన్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో 65 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర ఆసుపత్రుల్లో 708 వరకు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిల్లో 9,978 పారామెడికల్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. బోధనాసుపత్రుల్లో 10,065 పారామెడికల్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ వెల్లడించింది.

# మంత్రి సీతక్కను అమెరికా బోనాల ఉత్సవాలకు ఆహ్వానించిన నైటా



◆ **నైటా నూతన అధ్యక్షురాలిగా ఎంపికైన ఏనుగు వాణి అభినందించిన మంత్రి**

**హైదరాబాద్:** న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (నైటా) కొత్త అధ్యక్షురాలిగా ఎంపికైన వాణి ఏనుగును పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అభినందించారు. అమెరికా ప్రధాన నగరమైన న్యూయార్క్ లో తెలుగువారికి ఓ సంఘం ఏర్పాటు చేయటంతో పాటు, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించేందుకు నైటా చేస్తున్న కృషిని మంత్రి సీతక్క అభినందించారు. హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో నైటా కొత్త కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా శక్తికి ఆదర్శంగా నిలిచి, నైటా సేవలను మరింత విస్తృత పరచాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. వాణి ఏనుగుతో పాటు కుటుంబ సభ్యులను సన్మానించారు.

రానున్న జూన్‌లో నైటా తరపున న్యూయార్క్‌లో జరిగే బోనాల ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని మంత్రిని నైటా కార్యవర్గం ఆహ్వానించింది. ఇందుకు మంత్రి సీతక్క సుముఖత వ్యక్తం చేశారు.

# హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మూసివేత

జనవరి 2023 లో అదానీ గ్రూప్‌పై అనేక తీవ్రమైన ఆరోపణలు చేసిన అమెరికన్ షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ షాప్ ఇప్పుడు మూతపడింది. కంపెనీని మూసివేయాలని నిర్ణయించుకున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు నాథన్ ఆండర్సన్ స్వయంగా తెలిపారు. అండర్సన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఈ ప్రకటన చేశాడు.

అదానీ గ్రూప్‌తో సహా పలు వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకున్న అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రద్దు చేస్తున్నట్లు వ్యవస్థాపకుడు నాథన్ ఆండర్సన్ తెలిపారు. గౌతమ్ అదానీని వేల కోట్ల డాలర్లు మోసగించిన అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మూతపడింది. ఈ విషయాన్ని స్వయంగా కంపెనీ వ్యవస్థాపకుడు నాథన్ ఆండర్సన్ ప్రకటించారు.




2023 సంవత్సరం మొదటి నెలలో, హిండెన్‌బర్గ్ రీసెర్చ్ అదానీ గ్రూప్‌పై ఒక నివేదికను ప్రచురించింది. ఈ నివేదికలో అదానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న కంపెనీలపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో గౌతమ్ అదానీ ప్రపంచంలోని నాల్గవ సంపన్న వ్యక్తి. ఈ నివేదిక తర్వాత, అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు 80% పడిపోయాయి. హిండెన్‌బర్గ్ యొక్క ఈ నివేదిక రాజకీయ వర్గాల్లో కూడా చాలా వేడిని కలిగించింది.

అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ పూర్తిగా తోసిపుచ్చింది. తర్వాత సెబీ విచారణలో కూడా ఏమీ తేలలేదు. ఆరోపణలు నిజం కాకపోవడంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు మళ్లీ పెరిగాయి. హిండెన్‌బర్గ్ నివేదికను గ్రూపును అస్థిరపరిచేందుకు మాత్రమే కాకుండా రాజకీయంగా భారతదేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు తీసుకొచ్చారని గౌతమ్ అదానీ అన్నారు.

కంపెనీని మూసివేయడానికి గల కారణాలను ఆండర్సన్ వెల్లడించలేదు. కాగా, డొనాల్డ్ ట్రంప్ జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా తిరిగి వస్తున్న తరుణంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆండర్సన్ తన పోస్ట్‌లో కంపెనీ ప్రయాణం మరియు పోరాటాల గురించి చెప్పాడు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మూడు వ్యాజ్యాలు మరియు ఆర్థిక సవాళ్లను కూడా ఎదుర్కొంది. హిండెన్‌బర్గ్ అభివృద్ధి చేసిన పరిశోధన, ప్రక్రియలను ఓపెన్ సోర్స్ చేసే ప్రణాళికలను కూడా ఆండర్సన్ పంచుకున్నారు.

హిండెన్‌బర్గ్ 2022లో అదానీ గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకుంది. దేశంలోని మూడవ అతిపెద్ద పారిశ్రామిక సంస్థ అయిన అదానీ గ్రూప్ గురించి ఒక నివేదికను బయటపెట్టారు నాథన్ అండర్సన్. అదానీ గ్రూప్ అబద్ధం తప్ప మరేమీ కాదు, భారతదేశంపై గణన దాడులు అంటూ పేర్కొంది. అయితే ఈ విషయంలో సుప్రీం కోర్టు సైతం అదానీ గ్రూప్‌నకు క్లీన్ చిట్ ఇచ్చింది.

# కేటీఆర్.. కర్మ ఎవరిని వదిలి పెట్టదు!

◆ **ఎక్స్‌లో కేటీఆర్‌పై రాజా సింగ్ బీజేపీ ఎమ్మెల్యే**

◆ **కేటీఆర్‌కు జైలు చెక్‌లిస్ట్ పంపిన ఎమ్మెల్యే రాజాసింగ్**

**హైదరాబాద్ :** కర్మ ఎవరిని వదిలి పెట్టదు. కాంగ్రెస్, కాంగ్రెస్–బీఆర్ఎస్ ప్రభుత్వాలు నాపై తప్పుడు కేసులు పెట్టి, నన్ను జైలుకు పంపాయి. కేటీఆర్ జీ, జైలుకు వెళ్లే ముందు ప్యాక్ చేయాల్సిన చిన్న



చెక్‌లిస్ట్ పెడుతున్న. నాలుగు సెట్ల బట్టలు – కటకటాల వెనుక కూడా ఫ్యాషన్ ఉండాలి కదా? హాయిగా ఉండే దుప్పటి – జైలు సరిగ్గా హాయిగా ఉండదు. జైలులో కూడా టవల్ – పరిశుభ్రత ముఖ్యం. రుమాలు – నన్ను నమ్మండి, భావోద్వేగాలు ఉప్పొంగుతాయి. సబ్బు – ఆ "క్లీన్ ఇమేజ్"ని కొనసాగించడానికి. ఒక ప్యాకెట్ ఊరగాయ – ఎందుకంటే జైలు భోజనం ఫైవ్ స్టార్ కాదు. ఓహ్, వెచ్చని స్వెటర్‌ను మర్చిపోవద్దు – శీతాకాలం ఎప్పుడూ లేనంత చల్లగా ఉంటుంది. ఇతరులను లక్ష్యంగా చేసుకోవడానికి అధికారాన్ని దుర్వినియోగం చేసేవారు చివరికి అనుభవించక తప్పదు. కర్మ ఎవరిని మర్చిపోదు, అది సరైన సమయం కోసం వేచి చూస్తుంది.

# రేసు రద్దు నిర్ణయం వల్లనే ఖజానాకు నష్టం

◆ **ఫార్ములా-ఈ సంస్థకు పారదర్శకంగా బదిలీ**

◆ **ఇందులో అవినీతి, మనీలాండరింగ్ ఎక్కడ ఉంది?**

◆ **ఎక్స్‌లో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్:** ఫార్ములా–ఈని తెలంగాణకు తీసుకువచ్చి ప్రపంచ పటంలో హైదరాబాద్ నగరాన్ని నిలపడం మంత్రిగా నేను తీసుకున్న గొప్ప నిర్ణయాల్లో ఒకటిగా నిలుస్తుంది ఈ – రేసు సందర్భంగా అంతర్జాతీయ రేసర్లు, ఈ– మొబిలిటీ రంగానికి చెందిన ప్రముఖులు హైదరాబాద్ నగరాన్ని ప్రశంసలతో ముంచెత్తడం జరిగింది.

ఎన్ని రకాల చిల్లర కేసులు, బురదజల్లే కార్యక్రమాలు, రాజకీయ వేధింపులకు పాల్పడినా ఈ రేసు ద్వారా సాధించిన విజయాలను తగ్గించ లేవు. మంత్రిగా ఉన్నా లేకున్నా బ్రాండ్ హైదరాబాదును పెంపొందించడమే ఎల్లవేళలా ముఖ్యమైన అంశంగా నేను భావిస్తాను. ఫార్ములా–ఈ రేసు హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా పటంలో నిలిపింది.

ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విజన్, నిబద్ధత, హైదరాబాద్ నగరం అంటే అమితమైన ప్రేమ ఉండాలి. అందుకే ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం పంపిన 46 కోట్ల రూపాయల డబ్బులు ఫార్ములా–ఈ సంస్థకు అత్యంత పారదర్శకంగా బదిలీ చేయడం జరిగింది. కేవలం బ్యాంక్ లావాదేవీగా స్పష్టమైన రికార్డు ఉంది.

ఒక్క రూపాయి కూడా వృధా కాలేదు, ప్రతినయా పైసాకు లెక్క ఉంది. మరి అలాంటి అప్పుడు ఇందులో అవినీతి, మనీలాండరింగ్ ఎక్కడ ఉంది? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న అసంబద్ధమైన రేసు రద్దు నిర్ణయం వల్లనే రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లింది. తప్పు లేకున్నా కేవలం రాజకీయ వేధింపుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు కేసులు విచారణల పేరుతో ఈ అంశాన్ని లాగుతుంది. కచ్చితంగా ఈ అంశం లో నిజమే గెలుస్తుంది. ఇదే అంశాన్ని రాష్ట్ర ప్రజలు, కోర్టులు కూడా త్వరలో తెలుసుకుంటాయి. అప్పటిదాకా న్యాయం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.




# రేస్ డబ్బులను వారి అకౌంట్ల నుండి ఎందుకు ప్రభుత్వం రికవరీ చేయలేదు?

◆ **ఈడీ ఆఫీసు ముందు మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

**హైదరాబాద్:** తెలంగాణ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో ఇను మడింప చేయడానికి తీసుకొచ్చిన ఈ కార్ రేస్ ఈవెంట్ లో ఏదో అవినీతి జరిగిందని ఇంత అల్లకల్లోలం చేయాల్సిన అవసరం ఏముందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. దేశంలో బ్యాంకులకు లక్షల కోట్లు ఎగ్గొట్టి పారిపోయిన వారిని పట్టుకోకుండా, హైదరాబాద్ ను అంతర్జాతీయ స్థాయిలో నిల బెట్టడానికిచేసిన ఈ మంచి కార్యక్రమానికి కేటీఆర్‌ని ఈడి విచారించడం కరెక్టేనా? అయినా ఈడీ విచారణలో ముందు ముందు ముందు అన్ని విషయాలు బయటకు వస్తాయని, బ్యాంకు ట్రాన్సాక్షన్ ద్వారానే లావాదేవీలు జరిగినా, ఈ రేస్ డబ్బులను వారి అకౌంట్ల నుండి ఎందుకు ప్రభుత్వం ఇప్పటివరకు రికవరీ చేయట్లేదని ఆయన ప్రశ్నించారు. మాకు న్యాయస్థానం మీద నమ్మకం ఉందని, చట్టం మీద గౌరవం ఉందని అంతిమంగా న్యాయం గెలుస్తుందని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలు ఎవరు కూడా గొడవలు చేయొద్దని, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని బిఆర్ఎస్ కార్యకర్తలకు తెలిపారు.

# దేశంపై కాంగ్రెస్ దాడి ఇదే మొదటిసారి కాదు

◆ **రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఫైర్**




**విజయవాడ:** రాహుల్ గాంధీ తన భారత దేశ వ్యతిరేక భావజాలాన్ని బయటపెట్టడం ఇది తొలిసారి కాదు. కాంగ్రెస్ పోరాటం బీజేపీ, ఆర్ఎస్ఎస్ మీదే కాదు యావత్తు దేశం మీద అని ఇంతకు ముందే స్పష్టం చేశారు. మోహన్ భగవత్ మనం రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నా, ఆ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేమని చెప్పారు. రాహుల్ గాంధీ విషయాన్ని తప్పుగా వక్రీకరించి ప్రజల్ని మభ్యపెడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ జవహర్ లాల్ నెహ్రూ హయాం నుంచి, దేశ ప్రయోజనాలను పక్కన పెట్టి రాజ్యాంగాన్ని తమకు అనుకూలంగా సవరణలు చేసిన విషయం యావత్తు దేశానికి తెలుసు. దేశ రాజ్యాంగ నిర్మాత బాబా సాహిబ్ అంబేద్కర్‌ని కాంగ్రెస్ పార్టీ ఎలా అవమానించిందో ప్రతి ఒక్క పౌరుడికి తెలుసు. రాహుల్ గాంధీ, మీరు ఒక్క వేలు ఇతరుల వైపు చూపిస్తే మూడు వేళ్ళు మీ తప్పును బహిర్గతం చేస్తున్నాయి.

# దేశాన్ని మతం ఆధారంగా ముక్కలు చేసింది కాంగ్రెస్

◆ **ఇప్పుడు కులగణన పేరుతో మరోసారి విభజించే కుట్ర**

◆ **బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ**



**విజయవాడ:** దేశ అభివృద్ధికి, సాంస్కృతిక పురోగతికి పాటు పడే సంస్థ ఆర్ఎస్ఎస్, అటువంటి సంస్థ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ పై రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. అటువంటి నీచమైన వ్యాఖ్యలు ఎట్టి పరిస్థితుల్లో ఈ దేశం అంగీకరించదు. మోహన్ భగవత్ రామాలయ నిర్మాణం అనంతరం జరుగుతున్న భారత దేశ సాంస్కృతిక పునరుజ్జీవనం గురించి మాత్రమే వ్యాఖ్యానించారు, స్వాతంత్ర్య సమరాన్ని ఎక్కడా అవమానించలేదు పైగా ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు దేశం కోసం పోరాడారు, ఆఖరి శ్వాస వరకు పోరాడుతూనే ఉంటారు.

శ్రీ రాముడి అస్తిత్వం గురించి ఎటువంటి ఆధారాలు లేవని సుప్రీం కోర్టుకు తెలిపి, అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని అంగీకరించలేక, ప్రాణ ప్రతిష్ఠను తిరస్కరించి దేశ సంస్కృతిని అవమానించిన కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలు తిరస్కరిస్తున్నారు.

భారతదేశాన్ని మతం ఆధారంగా ముక్కలు చేసింది కాంగ్రెస్, ఇప్పుడు కుల గణన పేరుతో దేశాన్ని మరోసారి విభజించే కుట్ర రాహుల్ గాంధీ చేస్తున్నాడు, హిందులను విభజించే ఇంతటి నీచ రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారు, కాంగ్రెస్ కార్యాలయాలకు పరిమితమయ్యేలా చేస్తారు. అయినా స్వాతంత్ర్యం, స్వాతంత్ర్య సమరయోధులను గురించి మాట్లాడే హక్కు, అర్హత రెండు రాహుల్ గాంధీకి లేవు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, బాబా సాహెబ్ అంబేద్కర్ వంటి మహోన్నతమైన వ్యక్తులకు గౌరవాన్ని కల్పించలేదు సరికదా వారిని అవమానించి, వారి మరణానంతరం వారి కుటుంబాలను కూడా వెంటాడి, వేధించింది కాంగ్రెస్ పార్టీ, నేడు బాబా సాహెబ్ అంబెడ్కర్ గారి గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఆయనను రెండు సార్లు ఎన్నికల్లో ఓడించేందుకు సర్వశక్తులను ఒడ్డింది.

దేశ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన పి.వి.నరసింహ రావు గారి పార్థివ దేహాన్ని కాంగ్రెస్ కార్యాలయంలోకి కూడా అనుమతించకుండా అవమానించింది సోనియా గాంధీ, 20 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆయన చిత్రపటం కాంగ్రెస్ పార్టీలో లేదు, ఎందుకని? మీ దేశ వ్యతిరేక విధానాలను వ్యతిరేకించినందుకా?

జాతిపిత గాంధీని అవమానించేలా కాంగ్రెస్ పార్టీ నూతన జాతీయ కార్యాలయాన్ని "గాంధీ భవన్" కాకుండా "ఇందిరా భవన్" అని పిలవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి? దేశ ప్రజల హక్కులను చిదిమేసేందుకు ఆవిడ విధించిన ఎమర్జెన్సీని మరోసారి అమలు చేయాలనుకుంటున్నారా? మీ కుటుంబానికి కొన్ని దశాబ్దాల పాటు అధికారాన్ని ఇచ్చిన భారత దేశంపై, దేశం కోసం కార్యనిర్వహణ చేస్తున్న వ్యవస్థలపై పోరాటం చేస్తామంటూ రాహుల్ గాంధీ చేసిన దేశ వ్యతిరేక వ్యాఖ్యలు, కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని బహిర్గతం చేశారు. దేశ ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారు. సరైన సమయంలో ప్రజాస్వామ్య బద్ధంగా సమాధానం ఇచ్చే రోజు దగ్గరలోనే ఉంది.

# ఏటీఎం వాహన సిబ్బందిపై దుండగుల కాల్పులు

◆ **ఓ సెక్యూరిటీ గార్డు అక్కడి కక్కడే మృతి**

◆ **మరో ఇద్దరికి తీవ్ర గాయాలు**

◆ **రూ.93 లక్షల నగదు చోరీ**

బీదర్‌లో దుండుగులు పట్టపగలే దారి దోపిడీకి పాల్పడ్డారు .



కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. శివాజీ చౌక్‌లోని ఓ ఏటీఎం కేంద్రంలో డబ్బు లు పెట్టేందుకు వచ్చిన వాహనం సిబ్బందిపై కాల్పులు జరిపారు.

బైకుపై వచ్చిన ఇద్దరు నిందితులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఓ సెక్యూరిటీ గార్డు అక్కడి కక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నగదు పెట్టెతో దొంగలు పరారయ్యారు. అందులో రూ.93 లక్షల నగదు ఉన్నట్లు సమాచా రం. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయా నికి అతి సమీపంలో ఈ ఘటన జరిగింది.

జనం గుండె చప్పుడు

# మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 17, జనవరి 2025 ||

## తెలంగాణ కల సాకారంలో జైపాల్ రెడ్డి పాత్ర చిరస్మరణీయం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ఢిల్లీ:** ప్రత్యేక తెలంగాణ కల సాకారంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన చిత్ర పటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో సాధారణ పల్లె నుంచి ఢిల్లీ దాకా సాగిన ఆయన ప్రస్థానంలో నైతిక విలువలకు కట్టుబడ్డారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో, పార్లమెంట్ ఉభయ సభల్లో బలమైన గళం వినిపించారని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, బెల్లంపల్లి, పరిగి



ఎంఎల్ఏలు గడ్డం వినోద్, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాయకులు రోహిన్ రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.





## మనోజ్‌పై కేసు పెట్టిన మోహన్ బాబు

**రంగంపేట:** మంచు మనోజ్‌పై మోహన్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి, మోహన్ బాబు వర్సిటీలోకి మనోజ్ అక్రమంగా ప్రవేశించారని దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంచు కుటుంబంలోని వివాదం జల్ పల్లి నివాసం నుంచి ఎంబీ యూనివర్సిటీకి చేరిందని అనుకోవచ్చు.

రంగంపేటలో జల్లికట్టు పోటీలు చూసేందుకు వచ్చిన మనోజ్.. తన తాతయ్య, నానమ్మల సమాధులకు నివాళులు అర్పించేందుకు లోపలికి వెళ్తానని పట్టుబట్టారు. నిజానికి ఆయన వస్తున్నారని రెండు రోజుల ముందే మోహన్ బాబు క్యాంపునకు తెలిసింది. అందుకే అప్రమత్తమయ్యారు. కోర్టు ఆర్డర్స్ తెచ్చుకున్నారు. బౌన్సర్లను పెట్టుకున్నారు.

మనోజ్‌కు రంగంపేటలో కొంత మంది మద్దతు ఉంది. అలాగే యూనివర్సిటీ విద్యార్థుల్లో ఓ వర్గం సపోర్టు కూడా ఉంది. దాంతో మనోజ్ వచ్చి వర్సిటీలో అక్రమాలపై ధర్నాలు లాంటి పనులు చేస్తే పరువు పోతుందని యూనివర్సిటీ ఇమేజ్ దెబ్బతింటుందన్న ఉద్దేశంతో ఆయనను లోపలకి రాకుండా చేయడానికి చాలా ప్రయత్నాలు చేశారు.

## రాష్ట్ర వ్యాప్తంగా సంవిధాన్ గౌరవ దివస్

- బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి

**విజయవాడ, మహానాడు:**
సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమ బృందం ప్రతినిధులతో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి సమావేశమయ్యారు. సంవిధాన్ గౌరవ దివస్ కార్యాచరణకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, అండమాన్ నికోబార్ రాష్ట్రాల ఇంచార్జ్ ఎన్ మహేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సంవిధాన్ కార్యక్రమం క్షేత్ర స్థాయిలోకి తీసుకుని వెళ్ళేందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఆధ్వర్యంలో కార్యక్రమం రూప కల్పన



చేశారు. పలు ప్రాంతాల్లో దళిత యువకులు తో సహపంక్తి భోజనాలు, పోలింగ్ బూత్ స్థాయిలో సంవిధాన్ కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.
రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ కార్యక్రమం ఏర్పాటు ఎలా ఉండాలి అనే విషయాలను వివరించారు. సమావేశంలో సంవిధాన్ కార్యక్రమం రాష్ట్ర ఇంఛార్జిలు గుడిసె దేవానంద్, శరణాల మాలతీ రాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చర్యలు

- మంత్రి దామోదర రాజనర్సింహ

**మహబూబ్ నగర్:** రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాల అమలు పై మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల



సమన్వయ సమావేశంను రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు నిర్వహించారు.

మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ సందర్భంగా ఏమన్నారంటే...ఉమ్మడి పాలమూరు పరిధిలోని ఐదు జిల్లాల్లో ప్రతి నియోజకవర్గంలో రెండు గ్రామాల్లో పర్యటిస్తా. ఇందిరమ్మ కమిటీలు, జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు గ్రామ సభలో పాల్గొని క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి. సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి.
రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయబోయే నాలుగు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలి. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి.

సమన్వయ సమావేశంలో ఎం.ఎల్.సి కూచు కుళ్ళ దామోదర్ రెడ్డి, శాసన సభ్యులు జాన పల్లి అనిరుధ్ రెడ్డి(జడ్చర్ల), జి.మధు సూదన్ రెడ్డి(దేవరకద్ర), కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి( నాగర్ కర్నూల్), వాకిటి శ్రీ హరి (మక్తల్), మేఘా రెడ్డి (వన పర్తి), రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, స్పెషల్ ఆఫీసర్ జి.రవి నాయక్, జిల్లా కలెక్టర్ లు విజయేందిర బోయి(మహబూబ్ నగర్), బదావత్ సంతోష్(నాగర్ కర్నూల్), బి.ఎం.సంతోష్ (గద్వాల) ఆదర్శ్ సురభి (వన పర్తి), అదనపు కలెక్టర్ లు, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో ప్రమాదాలను నివారిద్దాం..

- సమిష్టి కృషితో ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం...
- రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు.

**ఎన్‌టీఆర్ జిల్లా:** ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని సమిష్టి కృషితో ప్రజలలో అవగాహన కల్పించి ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేసేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేది నుండి నెల రోజుల పాటు జిల్లాలో నిర్వహించనున్న రహదారి భద్రత మాసోత్స వాల ప్రచార సామాగ్రి అయిన పోస్టర్లు, కరపత్రాలు, బుక్ లెట్స్ బ్యానెర్లను గురువారం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు, డీటీసీ ఎ. మోహన్ లు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల పట్ల ప్రజలలో పూర్తి అవగాహన కల్పిం చేందుకు ప్రతి ఏడాది కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుం దన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 16వ తేది నుండి ఫిబ్రవరి 15వ తేది వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా మాసోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్ (ఐఏఆర్‌డీ) యాప్ ద్వారా రవాణా, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు తదితర భాగస్వామ్య పక్షాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సరైన విధంగా నమోదు చేయడం ద్వారా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రమాద బాధితులను కాపాడేందుకు కృషిచేసిన వారికి గుడ్ సమారిటన్ ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధలను పాటించని వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటున్నామన్నారు, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపే వారిపై కేసులను నమోదు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదలలో కీలకమైన మద్యం సేవించి వాహనాలు నడపడం డ్రైవింగ్ సమయంలో ఫోన్ మాట్లాడటం పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ లకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆన్లైన్ ద్వారా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.



జిల్లా రవాణా శాఖ అధికారి ఎ. మోహన్ మాట్లాడుతూ 16వ తేది నుండి ఫిబ్రవరి 15వ తేది వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని రోడ్డుభద్రతాపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, అవగాహన సదస్సులు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగం సహకారంతో పోలీస్, వైద్య ఆరోగ్య , ట్రాన్స్ పోర్ట్, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, తదితరశాఖల సమన్వయంతో స్వచ్ఛంధ సంస్థలు ప్రజలను భాగస్వాములను చేసి భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రచార సామగ్రి విడుదల కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు ఆర్. ప్రవీణ్, కె. వెంకటేశ్వరరావు, కె. శివరాం గౌడ్, ఉదయ్ శివప్రసాద్, డీవీ. రమణ, ఎన్ఎఎస్ వర్మ, కేడీవి రవికుమార్, బి. శ్రావణి, సత్యన్నారాయణ, రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం. రాజుబాబు, డిప్యూటీ డియంహెచ్ ఓ జె. ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ని కేసుల్లో ఇరికించే ప్రయత్నం

- కేటీఆర్ కృషి వల్లే తెలంగాణకి ఈ కార్ రేస్
- ఏసీబీ, ఈడీ అయితే ఈ రాష్ట్రంలో మంత్రులే విచారణ చేస్తున్నట్లు కనిపిస్తోంది
- కొన్ని ఛానళ్ల వాళ్ళు వారే ప్రాసిక్యూషన్ చేస్తున్నట్టుగా వ్యవహరిస్తున్నాయి
- మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ,జి .దేవి ప్రసాద్ ,తుల ఉమ

**హైదరాబాద్:** రేవంత్ ప్రభుత్వం కేటీఆర్‌ని కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేస్తోంది. అయినప్పటికీ కేటీఆర్ ఒకే లైన్‌తోనే ఉన్నారు. మొదటిరోజు ఏం మాట్లాడినారో ఇవాళ అదే మాట మాట్లాడుతున్నారు. ఈ దేశంలోనే తెలంగాణ నెంబర్వన్‌గా ఉండాలి. ప్రపంచ స్థాయిలో ఈ కార్ రేస్ ఉన్నటువంటి అనేక దేశాలు పోటీ పడ్డాయి. కేటీఆర్ కృషి వల్లే తెలంగాణకి ఈ కార్ రేస్ వచ్చిన విషయం ప్రపంచానికి తెలుసు.

ఈ కార్ రేస్‌ని కొనసాగించకుండా కేవలం కేసులు పెట్టాలి అనే కుట్రలో భాగంగానే ఈడి కేసులు. ఇది చాలా దురదృష్టకరం. ఇవాళ ఈడి ఎంటర్ అయినటువంటి సందర్భంలో విచారణ చేయాల్సింది ఏసీబీ, ఈడీ అయితే ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి మంత్రులే విచారణ చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇవాళ కొన్ని కొన్ని ఛానళ్ల వాళ్ళు వారే ప్రాసిక్యూషన్ చేస్తున్నట్టుగా విచారణలో భాగమైనట్టుగా వ్యవహరిస్తున్నాయి. సమాజాన్ని పక్కదారి పట్టించే కుట్రకు తెరలేపుతున్నాయి.
నిజానికి ఈడి విచారణ జరుగుతున్నటువంటి సందర్భంలో చాలా కాన్ఫిడెన్షియల్‌గా కొంతమంది అధికారుల మధ్యలో జరిగేటువంటి ఆ విచారణ వీరికి తెలిసినట్టుగా ప్రొద్దున నుంచి ఒక గందరగోళం సృష్టిస్తున్నారు. ప్రజల్ని గందరగోళ పరిచే పద్ధతిలో ఇలా చేయడం చాలా దురదృష్టం. అది వాంఛనీయం కాదు అనే మాట చెప్ప దలుచుకున్నాము.





మా నేత నిజాయితీగా ఉన్నాడు కాబట్టి ఎటువంటి కేసులకైనా భయపడకుండా ధైర్యంగా మొన్న తొమ్మిదో తారీఖు నాడు ఏసీబీ కేసు విచారణను ఎదుర్కొన్నాడు. ఇవాళ ఈడీ కేసు విచారణకు అవుతున్న సందర్భంలో, కేటీ ఆర్ వెంట కొందరు నాయకులు వస్తే వారి మీద కేసులు పెట్టడం ,అదుపులోకి తీసుకోవడం దుర్మార్గం. కొంతమంది నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ల కు తరలించారు. మా నేతల పై కారణంగా పెట్టిన కేసులు ఉపసంహరించుకుని అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి.

## న్యాయనిపుణులతో హరీష్ చర్చలు

(వెంకటేశ్వర్లు)

**ఢిల్లీ:** ట్రబుల్ షూటర్, బీఆర్ఎస్ కీలక నేత హరీష్‌రావు న్యాయ నిపుణులతో చర్చలు జరిపేందుకు ఢిల్లీ వెళ్లారు. ఓ వైపు కేటీఆర్ ఈడీ విచారణకు హాజరైన సమయంలో హరీష్ ఢిల్లీలో ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. అయితే ఈడీ కేసులు.. ఇతర వ్యవహారాలప మాట్లాడటానికి రాలేదు.. ఫిరాయించిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడానికి వచ్చామని హరీష్ రావు సన్నిహితులు చెబుతున్నారు.

ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పార్టీ రెండు పిటిషన్లు దాఖలు చేశారు. 10 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసిన 9 నెలలు అవుతున్నా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ పిటిషన్‌లో పేర్కొంది. హైకోర్టు తీర్పు ఇచ్చి 6 నెలలైనా ఇప్పటికీ స్పీకర్ చర్యలకు ఉపక్రమించలేదని కోర్టుకు బీఆర్ఎస్ తెలిపింది.
కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ పేర్కొంది. గతంలో కేశం మేఘా చంద్ర కేసులో ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోర్టును బీఆర్ఎస్ కోరింది. పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం చెప్పాలని కేశం మేఘా చంద్ర కేసులో తీర్పు వచ్చిందని .. ఆ తీర్పునకు అనుగుణంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవట్లేదని బీఆర్ఎస్ తెలిపింది. నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ కోరుతోంది.

అయితే ఈ పిటిషన్ దాఖలు చేయడానికి హరీష్ రావు ప్రత్యేకంగా ఢిల్లీ వెళ్లాల్సిన పనిలేదు. పిటిషన్లు దాఖలు చేయడానికి ప్రత్యక్షంగా ఎవరూ వెళ్లాల్సిన అవసరం లేదు. కానీ హరీష్ రావు ఢిల్లీ వెళ్లారు.



ఆయన ఢిల్లీ వెళ్లడానికి ప్రత్యేకమైన కారణాలు ఉన్నాయని తెలంగాణ రాజకీయవర్గాలు చెబుతున్నాయి. అవేమిటన్నది బీఆర్ఎస్ ముఖ్యులకు మాత్రమే తెలిసే అవకాశం ఉంది.

## ఏలూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు భేష్

- రూ.734 కోట్ల విలువైన 3.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ..
- 96 శాతం రైతులకు 24 గంటల్లోనే సొమ్ము చెల్లింపులు..
- జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**ఏలూరు:** ఖరీఫ్ ధాన్యం కొనుగోలు రాష్ట్రంలో మొదటిగా ఏలూరు జిల్లాలో ప్రారంభమై అదే దిశగా కొనుగోళ్లలో జిల్లా అధికారులు చూపిన చొరవను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్ చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందించారు.



గురువారం ఏలూరు విచ్చేసిన రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్ ధాన్యం సేకరణపై మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో రూ. 733.91 కోట్ల విలువైన 49,022 మంది రైతుల నుంచి 3,58,924 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం భేషుగ్గా ఉందన్నారు. సంబంధిత రైతులకు సొమ్ముకూడా చెల్లింపు చేయడం అభినందనీయమన్నారు. పౌర సరఫరాల రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుండి 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ దానికి మిన్నగా ధాన్యం కొనుగోలు చేయడం పట్ల జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డిలను మంత్రి అభినందించారు.

ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి నేతృత్వంలో పౌర సరఫరాల అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. వీరందరిని ఈ సందర్భపంగా ప్రత్యేకంగా మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేకంగా అభిందించారు. నాలుగు సంవత్సరాల అనంతరం రైతులు నిజమైన సంక్రాంతిని సంతోషంగా జరుపుకున్నారన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చాలా సమర్ధవంతంగా, పటిష్టవంతంగా జరిగిందన్నారు. ఏలూరు జిల్లాలో సుమారు మరో 10 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులుతమ దృష్టికి తీసుకు వచ్చారని తప్పకుండా ప్రతిధాన్యం కూడా ప్రభుత్వం నుంచి కనీస మద్ధతు ధరకు కొనుగోలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి కూడా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి లను అభినందించారు.



## తాత కేసీఆర్‌తో కలిసి హిమాన్ష్ పొలం పనులు

ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో హిమాన్షు రావు తన తాత కేసీఆర్ సూచనలతో తానే స్వయంగా పారతో మట్టి తీసి, ఓ చెట్టును నాటాడు. ఆ చెట్టు చుట్టూ ఎరువును కూడా పోసి మళ్లీ పారతో మట్టిని కప్పాడు. ఆ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన హిమాన్షు.. ఓ సందేశం ఇచ్చాడు. ఉత్తముల నుంచి నేర్చుకోవడం అని రాసుకొచ్చాడు. వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడానికి అడవుల పెంపకం చాలా అవసరం అని పేర్కొన్నాడు. మన సహజ వనరులను రక్షించడం, సంరక్షించడం మన బాధ్యత అని హిమాన్షు రావు మేసేజ్ ఇచ్చాడు.

## ఆర్టీసీ బస్సులను ఈ మోడల్‌లోకి మార్చేందుకు సహకరించండి


- కేంద్ర మంత్రి కుమారస్వామికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వినతి

**ఢిల్లీ:** హైదరాబాద్ నగరంలోని వంద శాతం బస్సులను ఎలక్ట్రిక్ మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో ఆయన కార్యాలయంలో సీఎం గురువారం



సాయంత్రం భేటీ అయ్యారు.

పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద జీసీసీ పద్ధతిలో బస్సులు కేటాయించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న డీజిల్





బస్సులకు ఎలక్ట్రిక్ కిట్ అమర్చి రిట్రో ఫిట్మెంట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు అవకాశం ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రి కుమారస్వామి దృష్టికి సీఎం ఏ.రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు.

హైదరాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే 2,800 బస్సులను జీసీసీతో పాటు రిట్రో ఫిట్మెంట్ మోడల్ కింద కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ, మహబూబాబాద్ ఎంపీలు రఘువీర్ రెడ్డి, బలరాం నాయక్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులున్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 17, జనవరి 2025



## ఎన్టీఆర్ వర్ధంతిని ప్రతి డివిజన్‌లో ఘనంగా నిర్వహించాలి

● ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ, మహానాడు:** తెలుగుదేశం పార్టీ(టిడిపి) వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి, తెలుగు ప్రజల ఆరాధ్యదేవుడు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని ఈ నెల 18వ తేదిన నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ఘనంగా నిర్వహించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. పటమట అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం ఉదయం సమన్వయకమిటీ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై మాట్లాడారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదల వైద్యానికి అయిన ఖర్చులను మంజూరు చేస్తూ పేదలు అప్పులపాలు కాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అండగా ఉంటున్నారని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూపాయి కూడా మంజూరు చేయకుండా పేదలు అప్పుల పాలు అయ్యేలా వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి వ్యవహారించాలరని ఆరోపించారు.

నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అన్న నందమూరి తారక రామారావు వర్ధంతిని ఈ నెల 18వ తేదిని ఘనంగా నిర్వహించాలని చెప్పారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా లక్ష రూ.లు చెల్లించి నియోజకవర్గంలోని 35 మంది పార్టీ జీవితకాల సభ్యత్వాలను తీసుకున్నారని చెప్పారు. నియోజకవర్గం రాష్ట్రంలో 9వ స్థానంగా ఉందన్నారు. ఇప్పటి వరకు తూర్పు నియోకవర్గపరిధిలో నిర్వహించిన సాధారణ సభ్యత్వాల జరిగిన తీరుపై ఎమ్మెల్యే గద్దె రామమోహన్ బూత్‌ల వారీగా పరిశీలించారు. ఇక నుంచి ప్రతినెల 9 తేదిన డివిజన్ కమిటీ,



ప్రతి నెలా 14వ తేదిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. కూటమిలోని టీడీపీ, జనసేన,బీజేపీలోని నియోజకవర్గంలోని ముఖ్యమైన నాయకులందరూ సమావేశమై చర్చించుకుని సమన్వయంతో ముందుకు వెళతామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. విజయవాడ మున్సిపల్ ఎన్నికలు ముందస్తుగా జరిగే అవకాశం ఉందని అందువల్ల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ, జనసేన నాయకులతో సమన్వయంతో కలిసి కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, గుండు శ్రీను, గద్దె క్రాంతికుమార్, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి కాంతిశ్రీ, గొరిపర్తి నామేశ్వరరావు, పి.ఈశ్వర్, అడపా నాగేంద్ర, వల్లూరు మధుసుధనరావులతో పాటు పలువులు డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## దివిసీమను ఎన్నటికి మరచిపోలేను

● హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

**చండీఘర్:** దివిసీమను ఎన్నటికి మరచిపోలేనని, తన సేవా జీవితానికి నాంది పలికింది దివిసీమలోనే అని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం చండీఘర్ రాజ్ భవన్లో అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ కుటుంబ సమేతంగా



దత్తాత్రేయను కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ దివిసీమ ఉప్పెన సమయంలో పనిచేసిన వారందరిని గుర్తు చేసుకుని పేరుపేరున వారి గురించి అడిగారు. నాటి ఉప్పెనలో మండలి వెంకట కృష్ణారావు చేసిన సేవ చారిత్రాత్మకమని దత్తాత్రేయ అన్నారు. కాళ్లలో ముళ్లు గుచ్చుకుని పుండ్లు పడినా లెక్కచేయకుండా అవిశ్రాంతంగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. కృష్ణారావు - ప్రభావతి దంపతులు తన పట్ల చూపిన ప్రేమాభిమానాలు మరచిపోలేనన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగు భాష అభివృద్ధికి కృష్ణారావు చేసిన కృషిని బుద్ధప్రసాద్ కొనసాగించడం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు.

తన ఆత్మకథలో దివిసీమ ఉప్పెన స్మృతులను రాస్తున్నట్టు దత్తాత్రేయ తెలిపారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తమ తండ్రి కృష్ణారావు మిమ్మల్ని సోదరునిగా భావించే వారని, మిమ్ములను మా కుటుంబ సభ్యునిగా మేమెప్పుడు భావిస్తామని అన్నారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ కుటుంబ సభ్యులను దత్తాత్రేయ ఆత్మీయంగా సత్కరించారు. ఆయనను బుద్ధప్రసాద్, వెంకట్రామ్ ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో బుద్ధప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి, కుమార్తె శీలం కృష్ణప్రభ, తనయుడు, కోడలు మండలి వెంకట్రామ్, మండలి సాయి సుప్రియ దంపతులు పాల్గొన్నారు.

## రేవంత్ .. సీమ నోటికాడ కూడును లాగేయడం తగదు

● సీమ ప్రజల నోటికాడ గుక్కెడు నీళ్లను అడ్డుకోవాలనుకోవడం దురదృష్టం

● ప్రాంతాల మధ్య విద్వేషం పెట్టి పబ్బం గడుపుకోవాలనుకోవడం తెలంగాణ ముఖ్యమంత్రికి భావ్యం కాదు

● శ్రీరామ ఎత్తిపోతల పథకం మోటార్లు ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు

**ఒంటిమిట్ట:** నదుల అనుసంధానం చెయ్యడం ఒక్కటే రాయలసీమ కరువుకు పరిష్కారం అని చంద్ర బాబు బనకచర్ల రిజర్వాయర్ నిర్మాణం ద్వారా గోదావరి, కృష్ణ, పెన్నా నదుల అనుసంధానం చేయాలని సంకల్పాన్ని కొందరు అడ్డుకోవాలనుకోవడం దురదృష్టం. రేవంత్ రెడ్డి సైతం రాజకీయంగా ఆర్థికంగా ఆంధ్రుల చేతుల్లో పెరిగి, తీరా ముఖ్యమంత్రి అయ్యి సీమ ప్రజల నోటికాడకు వస్తున్న గుక్కెడు నీళ్లను అడ్డుకోవాలనుకోవడం దురదృష్టం అన్నారు. ప్రాంతాలమధ్య విద్వేషం పెట్టి పబ్బం గడుపుకోవాలనుకోవడం తెలంగాణ ముఖ్యమంత్రికి భావ్యం కాదు అని హెచ్చరించారు. 2014 కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఒంటిమిట్ట ఆలయం అధికారికంగ , ప్రకటించి, ఆలయం పక్కన వున్న చెరువు నిరంతరం జలకల వుండాలని, చర్యలు చేపట్టన్నారు.



చామర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ.. శ్రీరామ నవమి నాడు తెప్పోస్తవం, ఒంటిమిట్ట ప్రజల త్రాగు సాగు మరియు మండలం మొత్తం భూగర్భ జలాలు పెంచాలని 35 కోట్లు వెచ్చించి సోమశిల వెనుక జలాలు ఎత్తిపోతల పథకం అభివృద్ధి చేస్తే, జగన్ పాలనలో మోటర్లు మెయింటినెన్స్ చెయ్యలేదు, సిబ్బందికి జీతాలు ఇవ్వలేదు అన్నారు.

భవిష్యత్తులో శాశ్వత పరిష్కారం కొరకు ప్రతిపాదనలను తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకపోతున్నట్లు చెప్పారు, ఈ కార్యక్రమంలో చెరువు అధ్యక్షుడు గంగిరెడ్డి , బిజెపి టీడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గోదా కల్యాణం



విశిష్టాద్వైత సంప్రదాయం ప్రకారం ఆండాళ్ లేదా గోదాదేవి సాక్షాత్తూ భూదేవి అవతారం. రామాయణంలో సీత లాగానే ఆమె కూడా అయోనిజ. జనకునికి సీత నాగేటిచాలులో దొరికినట్లు గోదాదేవి విష్ణుచిత్తునికి తులసీవనంలో దొరికింది. మనందరి కళ్లకూ రాతిబొమ్మగానే కనిపించే శ్రీరంగనాథుణ్ణి పెళ్లాడి ఆయనలోనే లీనమైపోయింది. అప్పటినుంచి ఆమె ఆండాళ్ అయింది.

ఆండాళ్ అంటే రక్షించడానికి వచ్చినది అని అర్థం. ఆమె దొరికినప్పుడు విష్ణుచిత్తుడు పెట్టుకున్న పేరేమో కోదై అంటే పూలదండ. తాను ముడిచి విడిచిన పూలను స్వామికి ఇచ్చి, ఆముక్తమాల్యద అని పేరు తెచ్చుకుంది. చూడికుడుత్త నాచ్చియార్, నప్పిన్నైప్పిరాట్టి, ఆండాళ్ అని వివిధ పేర్లతో ప్రస్తుతులు పొందిన ఆమె శ్రీరంగనాథుని ఇల్లాలు కావడం వెనుక తిరుప్పావై వ్రత మహిమ దాగుంది. ధనుర్మాసం నెలనాళ్లూ గోదాదేవి రోజుకొక్క పాశురంతో తిరుప్పావై గానంతో శ్రీరంగనాథుని అర్చించింది.

ఆమె భక్తికి మెచ్చిన స్వామి పాండ్యరాజు కలలో కనిపించి వివాహానికి ఏర్పాట్లు చేయమన్నాడు. వివాహానికి తరలిరావలసిందిగా విష్ణుచిత్తులకు కబురందింది. రాజు పంపిన పల్లకీనెక్కి కల్యాణానికి తరలి వెళ్తూ విరహోత్కంఠిత అయిన గోదాదేవి మరో ప్రబంధం రచించింది. అది ద్రవిడ సాహిత్యంలో నాచ్చియార్ తిరుమొళిగా ప్రసిద్ధికెక్కింది. ఒక రాతిబొమ్మను మానవకాంత పెళ్లాడే చిత్ర దృశ్యాన్ని చూడడానికి ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. శ్రీరంగంలోని చిత్ర వీధిలో నిండిపోయిన అశేష జనవాహిని మధ్య పల్లకి దిగింది పెళ్లికూతురు.

దేవాలయపు ఉత్తరపు వీధిలో భోగి పండుగనాడు గోదాకల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణ తంతు ముగిసిన మూలమూర్తికి అప్పగింతలు పెట్టడానికి పాండ్యరాజు వంటివారంతా తోడురాగా కన్యాదాత పెరియాళ్వార్ అమ్మను తోడ్కొని వెళ్లారు. గర్భాలయంలో శేషశయన మూర్తిగా దర్శనమిచ్చే శ్రీరంగనాథుని పాదాలను గోదాదేవి స్పృశించింది. స్వామి పాదాల వద్దసాక్షాత్తూ మహాలక్ష్మిలా ఆమె కూర్చునేంత వరకూ అందరికీ కనిపించి ఆయనలో లీనమయ్యింది.





## ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మంత్రి మనోహర్ ఆకస్మిక తనిఖీలు

● ఆస్పత్రిని అణువణువునా పరిశీలించిన మంత్రి నాదెండ్ల మనోహర్

● టాయిలెట్స్, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంపై సంబంధిత అధికారులను నిలదీసిన మంత్రి

**ఏలూరు:** ప్రభుత్వ ఆస్పత్రిని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఎక్కడ వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కనపడకూడదని స్పష్టం చేశారు. ఓపీ సేవలు సరిగా అందకపోవడంపై ఆసుపత్రి వర్గాలపై అసహన వ్యక్తం చేశారు.

నడవలేని స్థితిలో ఉన్న రోగులకు వీల్ చైర్లు ఏర్పాటు చేయకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహ వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో ఇటువంటివి పునరావతం కాకూడదన్నారు. వైద్యసేవలు అందుతున్న తీరుపై రోగులను అడిగి వివరానికి తెలుసుకున్నారు. ఇక, మగవారికి, మహిళలకు విడివిడిగా ఓపీ సేవలు సమర్థంగా అందేలా చూడాలని సూచించారు..

ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో టాయిలెట్స్, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంపై అధికారులను నిలదీశారు. నెలరోజుల్లో ఆస్పత్రిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.







## త్వరలో పెనుకొండకు మరిన్ని పరిశ్రమలు

● పెనుకొండ మున్సిపాలిటీ రూపురేఖలు మారుస్తాం.

● కోటి 53 లక్షల రూపాయలతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన మంత్రి సవిత

**పెనుకొండ,మహానాడు:** త్వరలో పెనుకొండకు మరిన్ని పరిశ్రమలు రాబోతున్నాయని పెనుకొండ మున్సిపాలిటీ రూపురేఖలు మారుస్తామని తెలియజేసిన మంత్రి సవిత పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలో రైల్వే స్టేషన్ రోడ్డుకు వెళ్లే రహదారికోసం 53 లక్షల రూపాయల నిధులతో భూమి పూజ చేశారు. అదేవిధంగా పెనుకొండలోని మడకశిర రోడ్డు నుండి



కోనాపురం వెళ్లే రహదారికి 50 లక్షల రూపాయల నిధులతో భూమి పూజ చేశారు.

డ్రైనేజ్ కొరకు మరో 50 లక్షల రూపాయల నిధులతో భూమి పూజ చేసిన మంత్రి సవిత ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని త్వరలో పెనుకొండ నియోజకవర్గముకు మరిన్ని పరిశ్రమలు రాబోతున్నాయని తెలిపారు.

ఐదు సంవత్సరాల్లో చేయని అభివృద్ధి మేము ఆరు నెలల లోనే చేసి చూపిస్తున్నాం. గత వైసిపి ప్రభుత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధి గాలికి వదిలేసారని అదేవిధంగా రోడ్డు రవాణా శాఖ మంత్రిగా ఉన్న శంకర్ నారాయణ ఇదే రోడ్డు లోనే వాకింగ్ చేసే వారిని కనీసం ఈ రోడ్



కూడా వేయలేక పోయారని మంత్రి విమర్శించారు.గతంలో కొనాపురం గ్రామానికి రోడ్ వేయమని ఎన్నోసార్లు ధర్నాలు చేసాం,ఈ గుంతల రోడ్‌లో వరినాట్లు కూడా వేసి నిరసన తెలిపామని, కానీ గత పాలకులు, అధికారులు పట్టించుకోలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్డు వేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చామని ఇచ్చిన మాటకు కట్టుబడి నేడు భూమిపూజ చేస్తున్నామని త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## నిరుద్యోగుల డబ్బు దోచుకుంటున్న మోసగాడు అరెస్ట్

**పల్నాడు జిల్లా, మహానాడు:** సత్తెనపల్లి, మహానాడు: రాజకీయ నాయకుల పేర్లు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.

చిత్తూరు జిల్లా సోమల మండలం తప్పన్నగారిపల్లి గ్రామానికి చెందిన అమాస భాను అలియాస్ పవన్ అలియాస్ రాజేష్ ను అదుపులోకి తీసుకున్న సత్తెనపల్లి పోలీసులు విచారణ చేపట్టారు.

గతంలో రాజకీయ నాయకుల వద్ద పీఆర్వోగా పని చేసిన అమాస భాను చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. చాలా మంది నాయకులు తెలుసని ఆ పలుకబడితో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగులను మోసం చేశాడు. చిత్తూరు జిల్లాలోనే పలు కేసు కేసులు నమోదయ్యాయి. అంతేకాదు ఒక హత్యాయత్నం కేసులో అతన్ని చిత్తూరు జిల్లా సోమ్లా పోలీసులు జైలుకు పంపించారు. ఆ తరువాత బెయిల్‌పై బయటకు వచ్చినా కూడా అతనిలో మార్పు రాలేదు.

సత్తెనపల్లి నియోజకవర్గంలోని పొలిటికల్ వాట్సాప్‌గ్రూప్‌ల్లోని సభ్యుల ఫోన్ నంబర్లను సేకరించాడు. వారికి ఫోన్లు చేసి రాజమండ్రి, తిరుపతి రేణుగుంట ఎయిర్‌పోర్టుల్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఫోన్ పే ద్వారా డబ్బులు వేయించుకుని ఉడాయించాడు. బాధితులు పలుమార్లు ఫోన్ చేసిన స్పందించకపోవడంతో మోసపోయామని గ్రహించారు.



బాధితుల ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి అమాస బానుతో పాటు నాగమల్లేశ్వరరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో నిందితులిద్దరికీ 14 రోజుల రిమాండ్ విధించింది కోర్టు. కాగా, ఎవరైనా జాబ్స్ ఇప్పిస్తామని తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచించరు.

## సీమ గురించి ఇకనైనా ఆలోచిద్దాం

మన సీమ గురించి ఇకనైనా ఆలోచిద్దాం
జవసత్వాలు కోల్పోతున్న మనుషులు
అనుభవించే హక్కులు తెలుసుకొని
సీమ భవిష్యత్తును గూర్చి చర్చిద్దాం..

రాయలసీమ రాళ్ళసీమగా మారే



జీవిస్తున్నం రాళ్ళలాగా ఉన్నాం
స్పందన లేకుండా జీవచ్ఛవంలా ఉంటూ
సీమ భవిష్యత్తును కాల రాస్తున్నాం...

ఎన్నాళ్లు మౌనంగా ఉంటాం
మన మనుగడే ప్రమాదంగా ఉంటే
బ్రతుకులు చిందరవందరం అవుతూ
నేల విడిచి వలసలు వెళుతుంటే..

ఏ ఎండకు వానకు ఆ గొడుగు పడుతూ
రాజకీయాల గొడుగులో ఉంటూ
చీకట్లోనే తిరుగుతున్నాం
ఆ నీడలు సీమను ఎడారిగా మారుస్తున్నాయి

చిమ్మ చీకట్లోనే సీమ బ్రతుకులు

ఈ వాస్తవాన్ని గ్రహించండి
సత్యాన్ని గ్రహించకపోతే అంధకారమే
మనభూమి ఎడారిగా మారిపోతుంది..

రాతి బతుకులు ఇంకెన్నాళ్లు
బండ రాళ్లలా మౌనంగా ఉంటాం
ఉద్యమాలకు ఊపిరి పోయకుంటే
భవితకు బ్రతుకులు భారమవుతాయి..

నీ నీటి హక్కు ప్రశ్నించు
నీ స్థాయిలో నీవు ప్రయత్నించు

మొదలు పెట్టకపోతే ఎట్లా
మనం భవిష్యత్తుకు ద్రోహం చేసినట్లే..

నాకెందుకులే అనుకుంటే పొరపాటే
సీమ జీవనం గ్రహ పాటే
సీమ మట్టి పొరలు తడపకుంటే
ఆకలి కేకల అనర్థాలు జరుగుతాయి..

- కొప్పుల ప్రసాద్
నంద్యాల, 9885066235

06

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 17, జనవరి 2025 ||

## మానవత్వం చాటుకున్న మంత్రి కొలుసు పార్థ సారధి

**ఏలూరు:** రాష్ట్ర గృహనిర్మాణం, సమాచార పౌర సంబందాల శాఖ మంత్రి కొలుసు.పార్థ సారధి జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడిన మహిళను సమీపంలోని ఆసుపత్రికీ పంపించి తన మానవత్వాన్ని చూపించారు. గురువారం ఏలూరులో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం ముగించుకొని విజయవాడ కు తిరిగి వస్తుండగా జాతీయ రహదారి పై కలపరు టోల్ ప్లాజా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడూరు పాడు కు చెందిన కే.శిరీష తీవ్రంగా గాయపడ్డారు.అదే సమయంలో జాతీయ రహదారి పై వెళుతున్న మంత్రి ప్రమాదాన్ని చూసి తన కాన్వాయిని ఆపి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. వెంటనే తన కాన్వాయిలోని మరో వాహనంలో ప్రమాదానికి గురిఅయిన శిరీషను సమీపంలోని పిన్నమనేని హాస్పటిల్‌కు తీసుకొని వెళ్ళి వైద్యం చేయించమని తన సిబ్బందిని ఆదేశించారు. పిన్నమనేని ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ప్రమాదానికి గురి అయిన



మహిళకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

ఈ ప్రమాదంలో శిరీష తల్లి కూడా స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంపై మంత్రి స్పందించిన తీరుకు జాతీయ రహదారిపై ప్రాయాణిస్తున్న పలువురు మెచ్చుకున్నారు.







## సముద్ర స్నానానికి వెళ్లి ముగ్గురు మృతి

- మంత్రి డోలబాల వీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట దిగ్భ్రాంతి

**ప్రకాశం, మహానాడు:** సంక్రాంతి సంబరాల అనంతరం సముద్ర స్నానానికి వెళ్లి ముగ్గురు మృతి చెందిన ఘటన సింగరాయకొండ మండలం పాకల బీచ్ వద్ద గురువారం చోటు చేసుకుంది. మృతుల్లో ఇద్దరు మహిళలు, యువకుడు ఉన్నారు. ప్రకాశం జిల్లా, పొన్నలూరు మండలం, తిమ్మపాలెం పంచాయితీ లోని శివన్నపాలెం గ్రామానికి చెందిన నోసిన జెస్సిక(15), నోసిన మాధవ(25 ), నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం కొల్లగుంట గ్రామానికి చెందిన కొండాబత్తిన యామిని(16) మృతులుగా పోలీసులు గుర్తించారు. మొత్తం అయిదుగురు



కందుకూరు ఏరియా ఆసుపత్రిలో మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

గురువారం ఉదయం సముద్ర స్నానం కోసం సింగరాయ కొండ సమీపం లోని పాకల బీచ్ వద్దకు వెళ్లారు. ఒక్కసారిగా పెద్ద అలలు రావడంతో వారు ఆ ఆలల్లో చిక్కుకున్నారు. ఒకరిని స్థానిక జాలర్లు రక్షించగా, మిగిలిన నలుగురు గల్లంతు అయ్యారు. ఇందులో ముగ్గురు ఆ అలల తాకిడికి తట్టుకోలేక మృత్యువాతకు గురయ్యారు. గల్లంతయిన మరొకరి ఆచూకీ ఇంకా తెలియరా లేదు.

మెరైన్ పోలీసులు స్థానిక జాలర్ల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, శివన్న పాలెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మూడు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సింగరాయకొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎం.పి.మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు శాసన సభ్యుడు దామచర్ల జనార్ధన్ రావు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు, రాష్ట్ర మెరైన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దామచర్ల సత్యన్నారాయణ(సత్య), రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ నూకసాని. బాలాజీ తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

## టీడీపీ విద్యార్థి యువసేన వార్షికోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

**వినుకొండ, మహానాడు:** పట్టణంలో ఈనెల 28వ తేదీన జరిగే తెలుగుదేశం పార్టీ (టీడీపీ) రాష్ట్ర విద్యార్థి యువసేన 3 వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్, శాసన సభ్యుడు జివి ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈమేరకు రాష్ట్ర విద్యార్థి యువసేన అధ్యక్షుడు సంపెంగుల రవి కుమార్ తెలిపారు. ఈ సభలకు సంబంధించిన కరపత్రాన్ని గురువారం జి వి ఆవిష్కరించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ విద్యార్థి నాయకులు బుదల సాగర్ బాబు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు నర్రా కిషోర్,వీరగంధం ప్రశాంత్, అర్వీవైస్ నాయకులు మెడ ఏసుబాబు, వెలిగండ్ల కోటేశ్వరరావు, మనేం ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కానిస్టేబుల్ అక్రమాస్తులు రూ.500 కోట్లు

- 52 కిలోల గోల్డ్, 10 కోట్ల నగదు సీజ్

**భోపాల్:** భోపాల్‌లో 2024 DEC 19న ఓ కారు నుంచి 52 కిలోల గోల్డ్, 10 కోట్ల నగదును ఐటి అధికారులు సీజ్ చేశారు. ఈ మొత్తం RTO మాజీ కానిస్టేబుల్ సౌరభ్ శర్మదిగా గుర్తించి ఇంట్లో సోదాలు చేయగా 500–700Cr అక్రమాస్తులు బయట పడ్డాయి. పరారీలో ఉన్న అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. బీజేపీ ప్రభుత్వంలో అవినీతికి ఇదే నిదర్శనమని



కాంగ్రెస్ విమర్శిస్తోంది. అయితే 15 నెలల కమల్ నాథ్ సర్కార్ కరప్షన్ మారుపేరని కమల నేతలు కౌంటరిస్తున్నారు.

## 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**అమరావతి:** ఈ నెల 26 న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్టమైన విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ సన్నాహక ఏర్పాట్లను గురువారం రాష్ట్ర సచివాలయం నుండి వర్చువల్ గా సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 26వ తేదీ ఉదయం 9.గం.లకు మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిధిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించ నున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయ మూర్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొననున్న దృష్ట్యా పటిష్టమైన బందో బస్తుతో పాటు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఈవేడుకలకు హాజరయ్యే ప్రముఖులతో పాటు ప్రతి ఒక్కరికీ తగిన సీటింగ్ ఏర్పాట్లు, అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. ఈవేడుకల ప్రాంగణంలో తగిన త్రాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగు దొడ్లు, బారీ కేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో రాజ్ భవన్, హైకోర్టు, అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం,సీఎం క్యాంపు కార్యాలయం సహా ఇతర ముఖ్య భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ఈసారి గణతంత్ర దినోత్సవం ఆదివారం వచ్చినందున ఈ వేడుకలకు పాఠశాల



పిల్లలను తరలించే అంశంపై విద్యాశాఖ అధికారులు, విజయవాడ జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. వివిధ శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

అంతకుముందు పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రెటరీసురేష్ కుమార్ వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివరించారు. వాటిలో ముఖ్యంగా పోలీస్ శాఖ తరపున స్టేడియం లోపల వెలుపల తీసుకోవాల్సిన బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి ఏర్పాట్లపై సూచనలు జారీ చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ముఖ్య అతిధి వారి గణతంత్ర దినోత్సవ సందేశం తయారీ మరియు ప్రచురణతో పాటు సరిపడిన ప్రతులు సిద్ధం చేసి అందరికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే పటిష్టమైన పబ్లిక్ అడ్రస్ సిస్టం, మీడియా లైవ్ కవరేజికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వీలుగా కనీసం 14 శాఖలకు సంబంధించిన శకటాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వేడుకల అనంతరం ఆయా శకటాలను విజయవాడ నగర ప్రధాన రహదారిపై ప్రదర్శనగా వెళ్ళేందుకు వీలుగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని విజయవాడ నగర పోలీస్ కమీషనర్కు ఆయన సూచించారు.

అదే విధంగా ప్రధాన వేదిక అలంకరణ ఇతర ఏర్పాట్లు సహా స్టేడియంలో ఇతర వసతులపై తగిన చర్యలు తీసుకోవాలని ఎన్టిఆర్ జిల్లా కలక్టర్, మున్సిపల్ కమీషనర్ లను ఆదేశించారు. వివిధ శాఖలవారీగా చేయాల్సిన ఏర్పాట్లపై సకాలంలో తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్. సురేష్ కుమార్, విజయవాడ 8 ఏఐఆర్ ఎన్.సి.సి. వింగ్ కమాండర్ ఎ.ఎస్.రాథీ, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, అడిషనల్ సెక్రెటరీ (జనరల్) కాళీ కుమార్, ఐఅండ్ పిఆర్ అదనపు సంచాలకులు ఎల్ స్వర్ణలత తదితర అధికారులు ప్రత్యేక్షంగా పాల్గొనగా, డిజిపి కార్యాలయపు ఐజిలు శ్రీకాంత్, రాజకుమారి, ఎన్టిఆర్ జిల్లా కలక్టర్, విజయవాడ పోలీస్ కమీషనర్ తదితరులు వర్చువల్ గా పాల్గొన్నారు.

## కేసు పెట్టాల్సి వస్తే సీఎం రేవంత్ రెడ్డిపై పెట్టాలి

- రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్‌తో రాత్రి బీజేపీతో సంసారం
- రేవంత్ రెడ్డి నోరు తెరిస్తే అబద్దాలు.. అడుగువేస్తే మోసాలు
- కాంగ్రెస్ నాయకులు ఏసీబీ ని ప్రభావితం చేస్తున్నారా ? డైరెక్ట్ చేస్తున్నారా?
- మహారాష్ట్ర తరహాలోనే ఢిల్లీ ప్రజలు కూడా కాంగ్రెస్ కు గుణపాఠం చెబుతారు
- మాజీ మంత్రి,ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

**హైదరాబాద్:** అబద్దాలు చెప్పి కాలం గడుపుతున్న సీఎం రేవంత్ రెడ్డి... తెలంగాణ తరహాలో ఢిల్లీ ప్రజలను కూడా మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. 13 నెలల కాలంలో రేవంత్ రెడ్డి తీరు నోరు తెరిస్తే అబద్దాలు..అడుగువేస్తే మోసాలు. సోనియాగాంధీ గొప్ప నాయకురాలు అని ఇవాళ ఢిల్లీలో అంటున్న రేవంత్ రెడ్డి... గతంలో బలిదేవత అన్న సంగతి తెలంగాణ సమాజం మొత్తానికి తెలుసు.

2004లో హామీ ఇచ్చి తెలంగాణ ఇవ్వకుండా ఆలస్యం చేసి, వేలాది తెలంగాణ బిడ్డల చావుకు సోనియాగాంధీ కారణం అని రేవంత్ రెడ్డి గతంలో విమర్శించారు. రాహుల్ గాంధీ నాలుగు నెలలుగా అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదని, రాహుల్ గాంధీ దృష్టిలో పడటానికి ఇవాళ రేవంత్ సోనియాను పొగుడుతున్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు 400 రోజులైనా నెరవేరలేదు ..ఏ ఒక్క హామీ కూడా సంపూర్ణంగా అమలు చేయలేదు.

మహారాష్ట్ర ఎన్నికల్లో రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ప్రజలు నమ్మలేదు,అందుకే రేవంత్ రెడ్డి ప్రచారం చేసిన అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ని ఓడించారు. మహారాష్ట్ర తరహాలోనే ఢిల్లీ ప్రజలు కూడా కాంగ్రెస్ కు గుణపాఠం చెబుతారు. మహిళలకు నెలకు 2500,తులం బంగారం,నిరుద్యోగ భృతి,స్టూడెంట్ కార్డు ఇలా ఇచ్చిన ఏ హామీలు అమలు కాలేదు. మేము తెలంగాణ లో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాము అని ఢిల్లీలో చెబుతున్న రేవంత్ రెడ్డి.. మీ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన నోటిఫికేషన్లు ఎన్నో చూపాలి. రుణమాఫీ అన్నావు 30 శాతం అమలు కాలేదు. రైతు




భరోసా ఊసే లేదు..సంక్రాంతికి అన్నారు సంక్రాంతి కూడా అయిపోయింది. రాష్ట్రం లో రేవంత్ రెడ్డిని నమ్మే వాళ్ళు ఎవరూ లేరు. తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి వైఖరిని గమనించాలని ఢిల్లీ ప్రజలను కోరుతున్నాను. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా,బాధ్యత గల నాయకుడిగా కేటీఆర్ ఈడీ విచారణకు వెళ్లారు. ఇది అక్రమ కేసు ఇందులో నయా పైసా అవినీతి జరగలేదని కేటీఆర్ మొదట్నుంచీ చెప్తున్నారు.

రేవంత్ రెడ్డి కక్షతో అక్రమ కేసు బనాయించి ఇబ్బంది పెట్టినా ..విచారణ సంస్థలకు కేటీఆర్ పూర్తి సహకారం అందిస్తున్నారు. ఈడీ కార్యాలయం వద్ద పోలీసులు అత్యుత్సాహంతో కొందరు బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేశారు. పోలీసులు రేవంత్ రెడ్డి చెప్పినట్టు కాకుండా, చట్టానికి లోబడి పని చేయండి. లేకుంటే అన్ని రోజులు ఒకేలా ఉండవని సూచిస్తున్నా.

ఫార్ములా ఈ కార్ రేస్ కేసు కేటీఆర్ పై రేవంత్ రెడ్డి కక్షతో పెట్టిన ఒక అక్రమ కేసు. హైదరాబాద్ ప్రతిష్ఠ కోసం ఫార్ములా– ఈ రేసు విషయంలో కేటీఆర్ గతంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్ రేస్‌లో ప్రతి రూపాయికి లెక్క ఉంది ఎక్కడ అవినీతి జరుగలేదు. 42 కోట్లు ప్రభుత్వ ఖాతా నుండి బదిలీ అయ్యాయి. ఎందరో ప్రముఖులు ఈ రేసు ను ప్రశంసించారు. ఈ మొబిలిటి రంగంలో ప్రపంచ దృష్టిని హైదరాబాద్ ఆకర్శించింది.

రెండో సారి రేసు జరగకుండా సీఎం రేవంత్ రెడ్డి రద్దు చేయడంతో రాష్ట్రానికి నష్టం జరిగింది. కేసు పెట్టాల్సి వస్తే సీఎం రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలి. ఈడీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ముఖ్యమంత్రిని విచారణ చేయాలి. మొదట్నుంచీ చెబుతున్నట్లే కాంగ్రెస్, బీజేపీ నేతల అసలు రంగు బయట పడుతోంది. కేటీఆర్ ను టార్గెట్ చేసి కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒకే రకంగా మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ బిజెపి ఒకరినొకరు ప్రేమించు కుంటున్నారు .వారిది అజబ్ ప్రేమ్ కి గజబ్ కహానీ.

కేటీఆర్‌పై ACB అక్రమ కేసు బనాయించగానే కాంగ్రెస్ మంత్రులు,ఎమ్మెల్యేలు క్యూ కట్టి మరీ ఆయన్ని అరెస్ట్ చేయాలని అంటున్నారు. కాంగ్రెస్ నాయకులు ఏసీబీ ని ప్రభావితం చేస్తున్నారా ? డైరెక్ట్ చేస్తున్నారా ? కాంగ్రెస్ నాయకులు మాట్లాడిన దారిలోనే బిజెపి నాయకులు కూడా కేటీఆర్ ని అరెస్ట్ చేయాలని అంటున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్,బిజెపి ఎంపీలు ఈడీని ప్రభావితం చేస్తున్నారా?

రేవంత్ రెడ్డి పగలు అంతా కాంగ్రెస్‌తో రాత్రి బీజేపీతో సంసారం చేస్తున్నాడు. బీజేపీ కార్యాలయంపై దాడి విషయంలో వెంటనే స్పందించిన పీసీసీ అధ్యక్షుడు.. బీఆర్ఎస్ కార్యాలయాలపై దాడుల గురించి ఎందుకు స్పందించడం లేదు? పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో రాజ్యాంగంలో ఉన్న ప్రతి అవకాశాన్ని బీఆర్ఎస్ ఉపయోగించుకుంటుంది. తనది కాంగ్రెస్ పార్టీ అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అధికారికంగా ప్రకటించారు. సంజయ్ పై సభాపతి ప్రసాద్ కుమార్ అనర్హత వేటు వేయాలి.

రేవంత్ రెడ్డికి తన పాత మూలాలను మర్చిపోలేక పోతున్నారు, పదేపదే గుర్తు చేసుకుంటున్నారు. కేటీఆర్ ఉద్యమ కారుడు, ఉద్యమ కారుని రక్తం పంచుకొని పుట్టిన బిడ్డ,పోరాట పటిమ కల నాయకత్వం కలవాడు. మీరెన్ని కేసులు పెట్టినా మీ పిట్ట బెదిరింపులకు కేటీఆర్ భయపడే రకం కాదు. మాకు న్యాయ వ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది మీ కుట్రలను ఛేదించుకొని కడిగిన ముత్యం లా కేటీఆర్ బయటకు వస్తారు.


రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,13 హామీలు 420 వాగ్దానాలు అమలు అయ్యేదాక తెలంగాణ ప్రజల పక్షాన కేసీఆర్ సైనికులుగా కేటీఆర్,మేము పోరాడుతూనే ఉంటాం..మీ వైఫల్యాలను ప్రజలలో ఎండగడుతూనే ఉంటాము.

## వైద్యుల నిర్లక్ష్యంతో ఆగిన పసి గుండె

- మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రి ఎమ్మారై స్కానింగ్ మిషన్‌లో ఆగిన 14 నెలల పాప గుండె

**మంగళగిరి:** కాకినాడకు చెందిన కొంతం గంగరాజు, కుమారి దంపతులకు 14 నెలల పాప తన్వి శ్రీ గత నెల రోజుల క్రితం ఆగి ఉన్న ద్విచక్ర వాహనం పైనుంచి కింద పడిపోగా మెడ లోపలి భాగంలో స్వల్ప గాయమైంది.దీంతో తల్లిదండ్రులు గత మూడు రోజుల క్రితం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు.

అప్పటివరకు ఆడుకుంటూనే ఉన్న తన్విశ్రీని బుధ వారంఉదయం ఎయిమ్స్ ఆసుపత్రిలోని ఎమ్మారై స్కానింగ్ తీసుకువెళ్లారు. వైద్యులు పాపకు మత్తు ఇచ్చారని తల్లిదండ్రులు తెలిపారు. అర్ధగంట తరువాత పాప స్కానింగ్ మిషీన్ లోనే చనిపోయిందని, క్యాన్సర్ అని వైద్యులు తెలిపారని తల్లి కుమారి ఆవేదన వ్యక్తం చేసింది. అప్పటివరకు జూనియర్ వైద్యులు వైద్యం అందించగా పాప మృతితో సీనియర్ వైద్యులు వచ్చి పరిశీలించారని తెలిపారు. పాప మృతికి వైద్యుల




నిర్లక్ష్యమే కారణమని, అప్పటివరకు ఆడుకుంటున్న తన్వి శ్రీ హఠాత్తుగా మృతి చెందడం తీవ్ర మనోవేదన కలిగించిందని తల్లి కుమారి కన్నీటిపర్యంతమయ్యింది.

నిర్ధారణ లేకుండా తన్విశ్రీకి క్యాన్సర్ అని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. తన్వి శ్రీ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. తీవ్ర మనోవేధనతో తన్వి శ్రీ తల్లిదండ్రులు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించగా పోలీసులు విచారణ చేపట్టారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రీమియం రైళ్లలోనూ ప్రయాణించే వెసులుబాటు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎల్టీసీ (లీవ్ ట్రావెల్ కన్సెషన్) స్కీమ్ కింద ప్రీమియం రైళ్లలోనూ ప్రయాణించే వెసులుబాటును కేంద్రం కల్పించింది. తేజస్, వందే భారత్, హంసఫర్ వంటి ఎక్స్ప్రెస్ రైళ్లలో ప్రయాణిం చేందుకు అనుమతిచ్చింది. దీని ప్రకారం ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు ప్రయాణ సమయంలో వేతనంతో కూడిన సెలవుతో పాటు టికెట్ ఖర్చులకు రీయింబర్స్మెంట్ పొందవచ్చు.



## పి4తోనే రాష్ట్రాభివృద్ధి

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు



**గుంటూరు, మహానాడు:** పి4 ఫార్ములతో పేదరికం లేని సమాజాన్ని సృష్టించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు అన్నారు. ఈ మేరకు ఆయన తెలుగుదేశం పార్టీ(టీడీపీ) జిల్లా కార్యాలయంలో గురువారం ఎన్.ఆర్.ఐ మిత్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2047 నాటికి ఒక ప్రత్యేక ప్రణాళిక సీఎం రూపొందించారని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి స్కిల్ డెవలప్మెంట్ పేరుతో విజనరీ నేత చంద్రబాబుపై బురద చల్లాలని చూస్తే సుప్రీంకోర్టు సైతం మొట్టికాయలు వేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాడు జన్మభూమి పేరుతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఘనుడని అన్నారు. పి4ఫార్ములతో మొట్ట మొదటిసారిగా ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయిలో మొదలు పెట్టడానికి ఎన్ ఆర్ ఐ మిత్రులు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. 1000మందితో ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు.



సత్తెనపల్లి నియోజకవర్గంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింది ఆర్థిక సాయం మంజూరయింది. వీటిని గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పంపిణీ చేశారు.

డిజిటల్ న్యూస్ పేపర్

శుక్రవారం 17, జనవరి 2025

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,85,450

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1న ప్రారంభమైన మన

మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న

మా అభిమాన పాఠకుల

అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్

మార్తి సుబ్రమణ్యం

సంపాదక సారథ్యంలో





బోడేపూడి సుబ్బారావు (BSR)

సారథ్యంలో



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 17, జనవరి 2025 ‖





## సంక్రాంతి బాక్సాఫీస్

పుష్ప 2 తరువాత తెలుగు బాక్సాఫీస్‌కి కొంత గ్యాప్ వచ్చినా, ఈ సంక్రాంతి బరిలో దిగిన మూడు పెద్ద సినిమాలు థియేటర్లకు తిరిగి ప్రాణం పోశాయి. డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం, గేమ్ ఛేంజర్ సినిమాలు ఈ పండుగ సీజన్‌లో ప్రేక్షకులను ఎక్కువగన్స్ ఆకర్షించాయి. మూడు సినిమాలు భిన్నమైన జానర్‌లలో ఉండటం, ప్రేక్షకుల ఆకలి తీర్చే ప్రయత్నం చేయడంలో కొంతమేర సక్సెస్ అయ్యాయి. డాకు మహారాజ్ మాస్ ఆడియన్స్‌ను బాగా ఆకర్షిస్తోంది. బాలయ్య తన మాస్ ఫాలోయింగ్‌ను మరోసారి హై లెవెల్లో ఎలివేట్ చేశారు. నిర్మాత ఏమన్నారంటే.. యాక్షన్, ఎమోషన్ల మేళవింపుతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బాగానే కలెక్షన్లు రాబడుతోంది. మాస్ బెల్ట్‌లో ఈ సినిమా ఊపు ఎక్కువగా ఉండడం విశేషం. బాలయ్య కెరీర్ లోనే బెస్ట్ ఓపెనింగ్స్ అందుకున్న సినిమాగా రికార్డు క్రియేట్ చేసింది. మరోవైపు సంక్రాంతికి వస్తున్నాం ఫ్యామిలీ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తోంది. వెంకటేష్ బ్రాండ్, అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ సంక్రాంతి పండుగ వాతావరణానికి మంచి అనుకూలతను కలిగించింది. ఇక గేమ్ ఛేంజర్ విషయానికి వస్తే, మొదటి రోజు హైప్ బాగానే ఉండినా, టాక్ అనుకున్న స్థాయిలో రాలేదు. కానీ సినిమాకు ఉన్న భారీ థియేటర్ కౌంట్ కారణంగా ఆదాయం బాగానే ఉంది. మెల్లగా గేమ్ ఛేంజర్ థియేటర్ల సంఖ్యను తగ్గిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక బాక్సాఫీస్ నంబర్లను పక్కన పెట్టినా, ఈ సినిమాలు మూడు కూడా థియేటర్లలో ప్రేక్షకులను రప్పించడంలో విజయవంతమయ్యాయి. థియేటర్ల ఆర్థిక లాభాలు కూడా ఈ మూడు సినిమాల విడుదలతో గణనీయంగా పెరిగాయి. ప్రతి టికెట్ విక్రయం వెనుక పార్కింగ్ ఆదాయం, క్యాంటీన్ ఆదాయం ప్రధాన పాత్ర పోషించాయి. ప్రత్యేకంగా, ఫ్యామిలీ ప్రేక్షకులు ఎక్కువగా వచ్చే సంక్రాంతికి వస్తున్నాం సినిమా క్యాంటీన్ ఆదాయాన్ని మరింతగా పెంచింది. పిల్లలతో కుటుంబం మొత్తం సినిమా చూడటానికి రావడం వల్ల థియేటర్ ఇన్ సైడ్ ఫుడ్ ఐటమ్స్ కొనుగోళ్లలో మరింత పెరుగుదల కనిపించింది. ఇంకా, చిన్న థియేటర్లలో అదనపు ప్లాస్టిక్ కుర్చీలు, సోఫాల వంటి ఏర్పాట్లు కూడా మంచి ఆదాయాన్ని రాబట్టాయి. ఫుల్ హౌస్ కనిపించే థియేటర్లు సంక్రాంతి సీజన్ వాతావరణాన్ని మరింత రసవత్తరంగా మార్చాయి. తక్కువ సీటింగ్ కెపాసిటీ ఉన్న థియేటర్లలో ఇలాంటి సొల్యూషన్స్ మరింత లాభాలను అందించాయి. ఈ తరహాలో ప్రతీ మూడు నెలలకోసారి ఆడియెన్స్ ను ఆకట్టుకునేలా ఉంటే సింగిల్ స్క్రీన్ థియేటర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పవచ్చు.



## 50 ఏళ్ళ అన్నపూర్ణ స్టూడియోస్- నాగార్జున

'రోడ్లే లేని రోజుల్లో నాన్న ఇక్కడికివచ్చి ఇంతపెద్ద అన్నపూర్ణ స్టూడియోస్ ఎలా స్థాపించారో నాకు ఇప్పటికీ అర్థం కాదు. కానీ ఒక్కటి మాత్రం తెలుసు. అన్నపూర్ణ స్టూడియోస్ ఎంతో మంది టెక్నిషియన్స్, కొత్త ఆర్టిస్ట్ లు, కొత్త డైరెక్టర్స్ కు ఉపాధి కల్పించింది. ఎంతో మందికి ఏయన్నార్ స్ఫూర్తి' అన్నారు కింగ్ అక్కినేని నాగార్జున. అన్నపూర్ణ స్టూడియోస్ ఏర్పాటు చేసి 50 ఏళు అయిన సందర్భంగా కింగ్ అక్కినేని నాగార్జున ప్రత్యేక వీడియో విడుదల చేశారు.

ఈ ప్రత్యేక వీడియోలో కింగ్ అక్కినేని నాగార్జున మాట్లాడుతూ.. అన్నపూర్ణ స్టూడియోస్‌కి 50వ ఏడు మొదలైయింది. నాన్న ప్రతి సక్సెస్ ఫుల్ మ్యాన్ వెనుక ఒక విమెన్ ఉంటుందని నమ్మేవారు. ఆయన సక్సెస్ వెనుక మా అమ్మ వున్నారని ఆయన బిలిఫ్. అందుకే ఈ స్టూడియోకి అన్నపూర్ణ స్టూడియోస్ అని పేరు పెట్టారు. అన్నపూర్ణ స్టూడియోస్‌కి వచ్చినప్పుడల్లా అమ్మ నాన్న ఇక్కడే వున్నారనిపిస్తుంది. ఇక్కడ ప్రతి ప్లేస్ వారి ఫేవరేట్ ప్లేస్. అన్నపూర్ణ స్టాఫ్ ని మేము ఫ్యామిలీగా భావిస్తాం. ఇవాళ స్టూడియో కళకళలాడుతుందంటే అది అన్నపూర్ణ ఫ్యామిలీ మూలంగానే. వాళ్ళు అన్నపూర్ణ వారియర్స్. ఈ సందర్భంగా వారికి ధన్య వాదాలు. 50 ఏళ్ల క్రితం సంక్రాంతి పండక్కి అన్నపూర్ణ స్టూడియోస్ ఓపెన్ అయ్యింది. ఆ తర్వాత ప్రతి సంక్రాంతికి అమ్మగారు నాన్నఅన్నపూర్ణ ఫ్యామిలీతో కలసి బ్రేక్ ఫాస్ట్ చేసేవారు. ఆ ట్రెడిషన్ ఇప్పటికీ అలానే కంటిన్యూ అవుతోంది.

## కల్కి2 కథేంటంటే?



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన కల్కి 2898 ఎడి తెలుగు సినిమా చరిత్రలో ఒక బిగ్ రికార్డ్ అందుకున్న విషయం తెలిసిందే. ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా విడుదలకు ముందే భారీ అంచనాలు ఏర్పడి, విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లను సాధించింది. 1000 కోట్లకు పైగా గ్రాస్ వసూళు రాబట్టి తెలుగు సినిమా గర్వకారణంగా నిలిచింది. ఇప్పటికే కల్కి 2 సీక్వెల్‌పై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావడంతో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక నిర్మాత అశ్విని దత్ ఇటీవల కల్కి 2 గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. సీక్వెల్ కథ మూడు ప్రధాన పాత్రల చుట్టూ తిరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పాత్రలు ప్రభాస్, కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ లకు సంబంధించినవి కావడం విశేషం. నిర్మాత ఏమన్నారంటే.. మొదటి భాగంలో అమితాబ్ అశ్వత్థామ పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉండగా, కమల్ హాసన్ కలి పాత్ర పరిమిత స్క్రీన్ టైమ్‌తో మాత్రమే ఉండింది. ఇది అభిమానులకు కొంత నిరాశ కలిగించింది. కానీ, కల్కి 2లో కమల్ హాసన్ పూర్తి స్క్రీన్ టైమ్‌లో కనిపించి, ప్రభాస్‌తో సన్నివేశాలు ప్రేక్షకులకు విశేషమైన అనుభూతిని కలిగిస్తాయని అశ్విని దత్ పేర్కొన్నారు. కమల్ హాసన్ ఇప్పటికే ప్రమోషన్ల సమయంలో తన పాత్ర గురించి వివరించి, ఇది రెండవ భాగంలో మరింత డెవలప్ అవుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో, ప్రభాస్, కమల్ మధ్య సన్నివేశాలు కథను మరో స్థాయికి తీసుకెళ్లేలా ఉంటాయని అంచనా. అమితాబ్ పాత్రకు ఈ సారి కూడా ప్రాధాన్యం ఉండడం విశేషం. దీపికా పదుకొణె పాత్ర కూడా రెండవ భాగంలో ప్రాముఖ్యాన్ని సాధిస్తుందని అశ్విని దత్ క్లారిటీ ఇచ్చారు. నూతన పాత్రలు ఈ సారి రావడం అనుమానమేనని నిర్మాత తెలిపారు. ఇది మొత్తం నారేటివ్‌ను ముగించేందుకు కేవలం ప్రధాన పాత్రల చుట్టూనే కథ సాగుతుందని చెప్పారు. సెకండ్ పార్ట్ 2026లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు అశ్విని దత్ స్పష్టం చేశారు. కల్కి 2 కథ, నిర్మాణ విలువలు, సాంకేతికతతో మరోసారి ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమాకు గర్వకారణంగా నిలిచే అవకాశం ఉంది. ఇక ఈసారి బాక్సాఫీస్ వద్ద పార్ట్ 2తో 2000 కోట్లు రావడం గ్యారెంటీ అనేలా మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.



## పాన్ ఇండియా సినిమాలో జగపతిబాబు

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ బుచ్చిబాబు సానా కలయికలో భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. ఉప్పెన వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు డైరెక్ట్ చేస్తోన్న సినిమా ఇది. రామ్‌చరణ్16గా రూపొందుతోన్న ఈ సినిమా కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. రామ్‌చరణ్ 16లో రామ్ చరణ్‌కు జోడీగా బాలీవుడ్ బ్యూటీ డాల్ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కరుణడ చక్రవర్తి శివరాజ్ కుమార్, విలక్షణ నటుడు జగపతిబాబు, మీర్జాపూర్ ఫేమ్ దివ్యేందు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. ఈ ఎక్స్‌పెక్టేషన్స్‌ను మరింత పెంచుతూ జగపతిబాబు ఆసక్తికరమైన విషయాన్ని తెలియజేశారు. తన పాత్రకు సంబంధించి బిహైండ్ ది సీన్ వీడియోను ఆయన షేర్ చేశారు. అంకిత భావంతో తనకిచ్చిన పాత్రలో ఒదిగిపోయే నటుడిగా జగపతిబాబుకి పెట్టింది పేరు. జగపతిబాబు షేర్ చేసిన వీడియో ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ 'చాలా కాలం తర్వాత రామ్‌చరణ్ 16కోసం బుచ్చిబాబు సానా చాలా మంచి పాత్రనిచ్చారు. ఈ సినిమాలో నా లుక్ చూసి నాకెంతో సంతృప్తి కలిగింది' అన్నారు. తాజాగా ఈ వెర్సటైల్ యాక్టర్ సినిమాలో తన లుక్ గురించి చేసిన వ్యాఖ్యలతో అందరిలో మరింత ఆసక్తి, అంచనాలు పెరిగాయి. జగపతిబాబు ఇప్పటి వరకు చూడనటువంటి సరికొత్త అవతార్‌లో మనకు కనిపించబోతున్నారు.

## 'బ్రహ్మ ఆనందం'లో అందరూ గొప్పగా నటించారు

**- బ్రహ్మానందం**

మళ్లీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద వంటి సూపర్ డూపర్ హిట్ చిత్రాలతో 100% సక్సెస్ రేటుని సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్. ఈ ప్రొడక్షన్ నుంచి నుంచి



రానున్న నాలుగో సినిమా 'బ్రహ్మ ఆనందం'. హాస్య బ్రహ్మ పద్మశ్రీ అవార్డ్ గ్రహీత బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హెూలక్కల్ హీరోయిన్స్‌గా నటించారు. శ్రీమతి సావిత్రి, శ్రీ ఉమేష్ కుమార్ సమర్పకులుగా డెబ్యూ డైరెక్టర్ ఆర్.వి.ఎస్.నిఖిల్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 14న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో తాజాగా ఈ మూవీకి సంబంధించిన టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ మేరకు గురువారం నాడు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో..'పద్మశ్రీ' బ్రహ్మానందం మాట్లాడుతూ.. 'బ్రహ్మ ఆనందం చిత్రానికి నిర్మాత రాహుల్ మెయిన్ పిల్లర్. వరుసగా మూడు హిట్లు ఇవ్వడం అంటే మామూలు విషయం కాదు. సెట్‌లో ప్రతీ పని దగ్గరుండి చేసుకుంటారు. నిఖిల్ వచ్చీ రావడంతోనే లెన్షన్ పడుతూ కాస్త తేడాగా కనిపించాడు. మీ కోసం, మీ పేరు మీదే సినిమా కథను రాసుకున్నాను అని, మీరు ఒప్పుకోకపోతే సినిమాను చేయను అని కాస్త తడబడుతూ చెప్పాడు. హీరో ఎవరు? అని అడిగా. రాజా గౌతమ్ అని చెప్పారు. ఆ తరువాత వెన్నెల కిషోర్ నుంచి ఫోన్ వచ్చింది. సరదాగా, నవ్వుతూ షూటింగ్ చేశాం. మితేష్ ఫోటోగ్రఫీ అద్భుతంగా ఉంటుంది. శాండిల్య మ్యూజిక్ ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. వెన్నెల కిషోర్ అద్భుతంగా నటించారు. సెట్‌లో యాక్టింగ్ చేసేటప్పుడే నాకు నవ్వొచ్చేది. ఈ చిత్రంలో అందరూ గొప్పగా నటించారు. నా లెగసీని కంటిన్యూ చేసే వారిలో కిషోర్ ఒకరు. దివిజ ఎంతో సహజంగా నటించింది. ఈ సినిమాకు ఓ రూపం రావడానికే ఎన్నెన్నో ట్విస్టులు వచ్చాయి.



## శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న రాక్షస

కన్నడ డైనమిక్ ప్రిన్స్ ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం రాక్షస. ఈ చిత్రాన్ని శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఒరిజినల్ వెర్షన్ కన్నడతో పాటు తెలుగులోనూ రిలీజ్ చేయనున్నారు. గతంలో శివరాజ్ కుమార్ నటించిన వేద చిత్రాన్ని విడుదల చేసిన ఎంవీఆర్ కృష్ణ రాక్షస ట్రైలర్ నచ్చి తెలుగు రైట్స్ ను దక్కించుకున్నారు. కంచి కామాక్షి కోల్ కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్ పై రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా హీరో ఫస్ట్ లుక్ ను పోస్టర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో ప్రజ్వల్ దేవరాజ్ డిఫరెంట్ లుక్ లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. లోహిత్ హెచ్ దర్శకత్వం వహించిన ఈ టైమ్ లూప్ హారర్ చిత్రం నుంచి విడుదలైన ఫస్ట్ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ సందర్భంగా నిర్మాత ఎంవిఆర్ కృష్ణ మాట్లాడుతూ.."ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్పీరియన్స్ ను అందిస్తుంది. సంక్రాంతి సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ ఫస్ట్ లుక్ పోస్టర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే టీజర్ ట్రైలర్ ను కూడా రిలీజ్ చేస్తాం. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు.



## రాశిఖన్నా సంక్రాంతి ట్రీట్

సాంప్రదాయం ఓవైపు.. గ్లామర్ ఎలివేషన్ మరోవైపు.. ఈసారి సంక్రాంతి బ్లౌజ్ ల ఎంపిక మునపటితో పోలిస్తే చాలా స్పైసీగా కనిపించాయి. బుల్లితెర నటీమణులు, వెండితెర కథానాయికలు సంక్రాంతి సందర్భంగా తమ ఫ్యాషన్ సెన్స్ విషయంలో చాలా అప్ గ్రేడ్ అయ్యారు. మునుపటి రోజులతో పోలిస్తే ఇటీవల కొంత ఎక్స్ పోజింగ్ కూడా ఎక్కువైందనేది కాదనలేని నిజం. ఈ మకర సంక్రాంతిని పురస్కరించుకుని అందాల కథానాయిక రాశీఖన్నా ఇచ్చిన ట్రీట్ అందుకు మినహాయింపేమీ కాదు. రాశీ చూడటానికి ట్రెడిషనల్ లుక్ లో కనిపించినా అందమైన బ్లౌజ్ ని స్పైసప్ చేసింది. ఒకే ఒక్క హుక్స్ పెట్టుకుని, అందమైన డిజైనర్ బ్లౌజ్ తో కవ్వించింది రాశీ. ఇక ఈ బ్లౌజ్ కి తగ్గట్టే, డిజైనర్ శారీని కూడా ఎంపిక చేసుకుంది. ఓవరాల్ లుక్‌లో రాశీ ట్రీట్ అభిమానులను కట్టి పడేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ యువతరంలో వైరల్‌గా మారుతున్నాయి. నిర్మాత ఏమన్నారంటే.. ఎర్ర అంచు చీర.. డిజైనర్ బ్లౌజ్ లో రాశీ ఖన్నా టూమచ్ గా కవ్విస్తోంది! అంటూ అభిమానులు భేజారైపోతున్నారు. రాశీ నెవ్వర్ బిఫోర్ లుక్ ఇది అంటూ వెబ్ లో వైరల్ చేస్తున్నారు.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144